ఈనాడు అనంతపురం



రైతు బజారులో మహిళకు నూనె పొట్లాలు అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జేసీ శివ నారాయణశర్మ

సరసమైన ధరలకు వంట నూనెలు

జిల్లాలో 17 కేంద్రాల ఏర్పాటు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులకు తక్కువ ధరకు వంట నూనెలు పంపిణీకి చర్యలు తీసుకున్నామని సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. జిల్లాలో 17 కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. గురువారం అనంతపురం ఎన్టీఆర్ రైతు బజారులో వంట నూనెల అమ్మకం కేంద్రాన్ని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి జేసీ ప్రారంభించారు. అనంతరం వినియోగదారులకు ఆయిల్ పొట్లాలను పంపిణీ చేశారు. జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పామాయిల్ ధర లీటరుకు రూ.130, పొద్దుతిరుగుడు నూనె ధర రూ.140 ఉండగా పామాయిల్ లీటరు రూ.118, పొద్దుతిరుగుడు నూనె లీటరుకు రూ.127 చొప్పున తక్కువ ధరకు అందిస్తున్నామని జేసీ వివరించారు. అనంతపురంలో వంట నూనె కేంద్రాన్ని ప్రారంభించామని, తాడిపత్రి, నార్పల, గార్లదిన్నె, కూడేరు, గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, శింగనమల, రాప్తాడు మండల కేంద్రాల్లో వంట నూనె కేంద్రాలను ప్రారంభిస్తామని జేసీ తెలియజేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే బియ్యం, కందిపప్పు, వంటనూనె తక్కువ ధరకు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు.

నాడు-నేడు

- ఊసేలేని అంగన్‌వాడీ కేంద్రాల పక్కా భవనాలు
- వైకాపా ప్రభుత్వ హయాంలో ఆగిన నిర్మాణాలు

అసంపూర్తి!




కళ్యాణదుర్గం మండలం కొత్తూరులో ఆగిపోయిన అంగన్‌వాడీ భవనం

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే

తల్లీబిడ్డలకు మేలు చేసే ప్రభుత్వం మాది.. అంటూ ఉపన్యాసలతో హోరెత్తించిన మాజీ సీఎం జగన్ తన పాలనలో అంతా తుస్.. అనిపించారు. ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాల పక్కా భవనాల నిర్మాణమే నిలువెత్తు సాక్ష్యంగా నిలిచాయి. మూడేళ్ల క్రితం 'నాడు-నేడు' పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరు చేసినా.. నిర్మాణ పురోగతి అతీగతీలేదు. ఒక్కటీ పూర్తి చేయలేని దుస్థితి నెలకొంది. మూడు మాసాల క్రితం తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీ కేంద్రాల పురోగతి, పరిరక్షణకు నడుం బిగించింది. వంద రోజుల పాలనలోనే అనంత జిల్లాకు తాగునీటి, మరుగుదొడ్ల నిర్మాణానికి 1232 పనుల కోసం రూ.3.26 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే పనులు ఆరంభమయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు



భవనాల స్థితిగతులు ఇలా..

అంశం	అనంత	శ్రీసత్యసాయి
మంజూరైనవి	91	88
పూర్తి అయినవి	00	00
మరమ్మతుల భవనాలు	841	642

శిథిలావస్థలో..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పక్కా భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో కనీసం మరమ్మతుకు నోచుకోలేదు. సరికదా.. కొత్త భవనాల నిర్మాణం పూర్తి చేయలేదు. 2187 అద్దె భవనాలు ఉంటే.. 'నాడు-నేడు' పథకం కింద 2021-22లో కేవలం 171 భవనాలకు మాత్రమే నిధులు మంజూరు అయ్యాయి. అనంత జిల్లాలో 91, శ్రీసత్యసాయి జిల్లాలో 80 ప్రకారం ఉన్నాయి. ఒకో భవన నిర్మాణానికి రూ.12.5లక్షలు కేటాయించారు. నిధులు మాత్రం మంజూరు చేయకపోవడంతో చాలా వరకు భవన నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు.

మరమ్మతులు కరవు

కనీసం చిన్నచిన్న మరమ్మతులు సైతం చేయించలేదు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు, ఫర్నీచర్, వంట సామగ్రి.. ఇలా కనీస వసతులు సమకూర్చని దుస్థితి నెలకొంది. 'నాడు-నేడు' రెండో విడత(బీ) కింద ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామంటూ ఉత్తర్వు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1483 పనులకు పరిపాలన ఉత్తర్వు వచ్చింది. అనంత జిల్లాలో 841, శ్రీసత్యసాయి జిల్లాలో 643 ప్రకారం కేటాయించారు. రెండేళ్ల క్రితం కొన్ని పనులు చేసి చేతులు దులుపుకొన్నారు. ఎక్కడా పూర్తి చేయలేదు.

వాస్తవమే.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

- బీఎన్ శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో విడత కింద కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం జరిగింది వాస్తవమే. నిధులు సమస్య తలెత్తడంతో ఒకటీ పూర్తి కాలేదు. ప్రస్తుతం నిర్మాణ పనులు జరగలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం.

సేవామూర్తి.. విద్యాదీప్తి



వ్యాపార దిగ్గజం రతన్‌టాటాకు పుట్టపర్తితో ఎంతో అనుబంధం ఉంది. గతంలో తరచూ శ్రీసత్యసాయిబాబా దర్శనానికి వచ్చి.. ఆశీర్వాదం తీసుకున్నారు. సత్యసాయిబాబా చేపట్టిన విద్యావాహిని ప్రాజెక్టుకు రూ.144 కోట్లు అందించి.. ఎంతో మంది విద్యార్థుల అభ్యున్నతికి దోహదం చేశారు. ఈ ప్రాజెక్టును ప్రశాంతి నిలయంలో బాబా సమక్షంలోనే రతన్‌టాటా ప్రారంభించారు. **- న్యూస్‌టుడే, పుట్టపర్తి**

దేవీదర్శనం.. కనులకు భాగ్యం



శరన్నవరాత్రి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శోభాయమానంగా సాగుతున్నాయి. గురువారం పలు ఆలయాల్లో వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతపురంలోని పాతూరు కన్యకాపరమేశ్వరిదేవిని బంగారు గుండీలతో అలంకరణ ఆకట్టుకుంది.
-న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె విరమణ

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు గురువారం సమ్మె విరమించారు. గత నెల 29 నుంచి నిరవధిక సమ్మెలో ఉన్న విషయం తెలిసిందే. కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీ, డీఈఈ శ్రీనివాసులు, గుత్తేదారులతో కలిసి కార్మిక సంఘం ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. వారి సమస్యలను సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అధికారులకు వివరించారు. సుదీర్ఘంగా సాగిన చర్చలు ఫలించాయి. ఆరు నెలల బకాయి వేతనంతో పాటు 20 నెలల పీఎఫ్ చెల్లించడానికి అధికారులు ఒప్పుకొన్నారు. దానిపై అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. అనంతరం పీఏబీఆర్ వద్ద ఉన్న ప్రధాన తాగునీటి పంపింగ్ కేంద్రంలో మోటార్లను ఆన్‌చేసి, పంపింగ్‌ను ప్రారంభించారు.

అందని సాగు నీరు.. పంటపొలాలు బీడు



పంట పొలాల్లో ముళ్ల పొదలు

శింగనమల, న్యూస్‌టుడే : ఆ భూములు హెచ్చెల్సీ సాగునీటితో తడిచి ఏటా రెండు పంటలు పండేవి. ఆప్రాంతాల్లోకి అడుగుపెడితే పచ్చని పైర్లు కళకళాడుతూ కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. కనుచూపు మేరా భూముల్లో ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఆ భూములన్నీ సాగుకు నోచుకోక దూరంగా ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం...పాలకులు పట్టించుకోక పోవడం తమకు శాపంగా మారిందని శింగనమల మండలం ఆకులేడు, లోలూరు, రఘునాథపురం, మదిరేపల్లి, తదితర ప్రాంత రైతులంతా వాపోతున్నారు.

నాడు రెండు పంటలు

రైతులు హెచ్చెల్సీ సాగునీటితో 350 ఎకరాల పంట పొలాలను సాగు చేసే వారు. రబీ, ఖరీఫ్ సాగుతో జీవనం సాగించే వారు. అన్నదాత పంట సాగుతో గ్రామంలోని వ్యవసాయ కూలీలకు ఉపాధి లభించేది. వరి, మొక్కజొన్న, జొన్న, పప్పుశనగ పంటలు సాగు చేస్తుండేవారు. ఇప్పుడు సాగునీరు కరవైంది. హెచ్చెల్సీ అధికారులకు కాలువలను సాగునీటి వదలక పంట పొలాలు బీడుగా మారాయి.

ఎమ్పీఆర్‌డ్యాం ఐదో కాలువ నుంచి సాగు నీరు పిల్ల కాలువల ద్వారా ఆకులేడు, లోలూరు, రఘునాథపురం, మదిరేపల్లి గ్రామాలకు వచ్చేది. అధికారులు 12 ఏళ్లుగా కాలువలకు సాగునీరు వదలడం లేదు. ఇప్పుడా కాలువలు ఉనికి కోల్పోయాయి. రైతన్నలు పొలాలను బీడుగా వదిలేశారు. వర్షాధారం కింద పంట సాగు చేసి నష్టాల పాలయ్యారు. ఒక్కో ముళ్ల పొదలు ఏపుగా పెరిగి పొలాలను ఆక్రమించేశాయి. అవి అన్నీ చిట్టడవిని తలపిస్తున్నాయి.

ఎందుకీ నిర్లక్ష్యం

ఎంపీఆర్ డ్యాం ప్రధాన కాలువ నుంచి సాగు నీరు పిల్ల కాలువలకు రావాల్సి ఉంది. గతంలో మూడేళ్లు వరుసగా సాగునీరు వదల్లేదు. దీంతో ఆ కాలువలు పూడికతో నిండి పోయాయి. ఇదే కారణంగా హెచ్చెల్సీ అధికారులు సాగునీటిని వదలడం మానేశారు.

తగిన చర్యలు తీసుకుంటాం

-సురేంద్రనాథ్‌రెడ్డి, జేఈ, హెచ్చెల్సీ

ప్రధాన కాలువ వరకు సాగునీటిని వదులుతున్నాం. ఈ కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగునీటి అందించే ప్రయత్నం చేస్తాం. పిల్లకాలువను రైతులు అభివృద్ధి చేసుకోవాలి. రైతులు ఐక్యతగా కాలువలను శుభ్రం చేస్తే సాగునీటిని అందిస్తాం.



అనంతపురం: గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డు తీరు

అనంత కావాలి..అంబికాపురం!

వ్యర్థాల నిర్వహణలో అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ ఆదర్శం

ఈనాడు అనంతపురం: పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అంబికాపూర్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. సుమారు 2 లక్షల జనాభా. ఈ మున్సిపల్ కార్పొరేషన్ 8 సార్లు స్వచ్ఛ పురస్కారాలు సాధించింది. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా వంద శాతం వ్యర్థాలను పునర్వినియోగం చేస్తున్నారు. నగరంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. తడి చెత్తను ఎరువుగా మార్చి విక్రయిస్తున్నారు. చెత్తను రీసైక్లింగ్ చేయడానికి సుమారు 19 చిన్నచిన్న కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో ముగ్గురు చొప్పున మహిళను నియమించి చెత్తను వేరుచేసే బాధ్యతను అప్పగించారు. వ్యర్థాల పునర్వినియోగం చేయడం ద్వారా నెలకు రూ.13 లక్షలు ఆదాయం సమకూరుతోంది. నిత్యం 90 శాతం చెత్తను పునర్వినియోగం చేస్తున్నారు. మిగిలిన 10 శాతం ప్లాస్టిక్‌ను సమీపంలోని సిమెంటు ఫ్యాక్టరీలకు విక్రయిస్తున్నారు.



అంబికాపూర్‌లోని డంపింగ్ యార్డు స్థలంలో ఏర్పాటు చేసిన సుందరమైన పార్కు

ప్రజా భాగస్వామ్యంతో..

అంబికాపూర్ మున్సిపల్ అధికారులు వ్యర్థాల నిర్వహణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నారు. నగరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ఇచ్చిన వారికి ఆహారం అందిస్తున్నారు. ఇందుకోసం ప్లాస్టిక్ కేఫ్ పేరుతో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఫలితంగా ఖాళీ ప్రదేశాల్లోని ప్లాస్టిక్ ఎప్పటికప్పుడు శుభ్రం అవుతోంది. వంద శాతం చెత్తను పునర్వినియోగిస్తుండటంతో నగరంలో చెత్త పోగేయడం అనేది జరగదు. ఫలితంగా 15 ఎకరాల డంపింగ్ యార్డును సుందరమైన పార్కుగా తీర్చిదిద్దారు.

మన చెత్తగుట్టలు కరిగేనా?

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల పునర్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం లేదు. ఇక్కడ నిత్యం 120 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఎక్కడా తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించడం లేదు. వ్యర్థాలను కలిపి డంపింగ్ యార్డులో పారబోస్తున్నారు. ఫలితంగా గుత్తిరోడ్డులోని డంపింగ్ యార్డును చెత్తతో నిండిపోయి గుట్టలను తలపిస్తోంది. మరోవైపు నిత్యం డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి... పొగ వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే గుత్తిరోడ్డు పొగతో నిండిపోవడంతోపాటు వాహనదారులు సమీప కాలనీల వాసులు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పరిసర ప్రాంతాల్లో విద్యాసంస్థలు ఉండటంతో అందులోని కొందరు విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

బయో మైనింగ్ పరిష్కారం..

గుత్తిరోడ్డులో 30 ఏళ్ల కిందట డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. నిత్యం 120 నుంచి 125 టన్నుల చెత్త పోగవుతోంది. రెండేళ్ల కిందట బయోమైనింగ్ ద్వారా కొంత ఖాళీ చేశారు. ఇప్పుడు సుమారు 90 వేల టన్నులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సమస్యకు పరిష్కారం బయో మైనింగే అని నిపుణులు చెబుతున్నారు. డంపింగ్ యార్డును మరొక చోటుకు తరలించినా కొన్నేళ్లకు అక్కడ సమస్య జఠిలమవుతుందని.. చుట్టుపక్కల కూడా కాలుష్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఏరోజు సేకరించిన చెత్తను అదేరోజు పునర్వినియోగం చేయాలని సూచిస్తున్నారు. తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువులు, బయోగ్యాస్, ప్లాస్టిక్ నుంచి డీజిల్, పెట్రోల్, కిరోసిన్ వంటివి ఉత్పత్తి చేయవచ్చు. కార్పొరేషన్ ద్వారా సాధ్యం కాకపోతే ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతలను అప్పగిస్తే మేలని సూచిస్తున్నారు.



వంతెనపై ప్రయాణం.. ఆదమరిస్తే ప్రమాదం

పామిడి మండల కేంద్రం నుంచి కల్లూరు వచ్చే దారిలో పెన్నా నదిపై కిలోమీటరు పొడవునా లో లెవెల్ వంతెన ఉంది. గతంలో వచ్చిన వరదలకు దెబ్బతినటంతో మరమ్మతులు కొంతమేర జరిగాయి. ఇప్పటికీ వంతెన మీద పలుచోట్ల రక్షణ లేకుండా పోయింది. నిత్యం ఆర్టీసీ బస్సులతో సహా అనేక వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి ప్రమాదకరంగా ఉండటంతో రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

- ఈనాడు, అనంతపురం.

పల్లె పండగను విజయవంతం చేద్దాం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి జరిగే 'పల్లె పండగ' వారోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా, మండల అధికారులతో వీక్షణ సమీక్ష నిర్వహించారు. ప్రతి పంచాయతీ కార్యాలయంలో సిటిజన్ బోర్డు ఏర్పాటు చేయాలి. ఏమేమీ పనులు చేస్తున్నామో అందులో ప్రదర్శించాలి. భూమి పూజ, శంకుస్థాపనలకు సంబంధించిన ఫొటోలు నిర్దేశిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తులతూగాలని కలెక్టర్ వినోద్‌కుమార్ విజయ దశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండగను జరుపుకొంటారన్నారు

మద్యం దుకాణాలకు నేటి సాయంత్రం 7 వరకూ దరఖాస్తు గడువు



అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు నేడు (శుక్రవారం) సాయంత్రం 7 గంటలకు వరకు ఆశావహులు దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసేవారు స్థానికంగా ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో చేసుకోవచ్చన్నారు. ఆశావహులు ఎలాంటి అపోహలు పడొద్దన్నారు. ఎలాంటి భయభ్రాంతులకు లోనుకాకుండా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయాలనుకునే వారు ధైర్యంగా ఎక్సైజ్ స్టేషన్లలోనే చేసుకోవాలన్నారు. అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. దుకాణాల ఎంపిక ప్రక్రియ ఈ నెల 14న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వీటి ఎంపిక ప్రక్రియ ఆయా జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా జరుగుతుందని డీసీ వివరించారు. గురువారం అనంతపురం జిల్లాలో మద్యం దుకాణాలకు మరో 231 దరఖాస్తులు వచ్చాయి. వీటితో కలిపి మొత్తం 1930 దరఖాస్తులు నమోదు అయ్యాయి.



వైద్య సేవలకు 'సెలవు'

- 700 మంది రోగులకు ముగ్గురే వైద్యులు
- దుర్గం వంద పడకల ఆసుపత్రిలో దయనీయం



చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

గుమ్మఘట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారు. స్కానింగ్ అవసరమై ఆ విభాగానికి వెళ్లారు. వైద్యురాలు రాత్రివేళ విధులు నిర్వహించారని, రాలేదని సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగారు. ఇలాంటి కేసులు నిత్యం ఇక్కడ కనిపిస్తున్నాయి.

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: రాయదుర్గం వంద పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు అందటం లేదు. ఇక్కడ ఎనిమిది మంది వైద్యులు సెలవుల్లో వెళ్లారు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. వైద్యులు లేక రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి. చాలామంది ఓపిక నశించి వెనుదిరుగుతున్నారు. మరికొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. గర్భిణుల పరిస్థితి దయనీయం. కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉన్నా వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

రాయదుర్గం ఆసుపత్రిలో మొత్తం 24 మంది వైద్యులు ఉండాలి. కానీ 11 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ముగ్గురు సివిల్ సర్జన్ స్పెషలిస్టులు(సీఎస్ఎస్). ఇక ఎనిమిది మందిలో ఒకరు సస్పెన్షన్‌కు గురయ్యారు. మిగిలిన ఏడుగురు వివిధ కారణాలతో సెలవుల్లో వెళ్లారు. ఆసుపత్రికి రోజూ 600 నుంచి 700 రోగులు వస్తుంటారు. వీరిలో 40 నుంచి 60 మంది దాకా ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. వైద్యులు మాధవి, మెర్సిజ్ఞానసుధ, ఉమామహేశ్ చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరు రాత్రి విధులు నిర్వహిస్తే ఉదయం ఆఫ్ తీసుకుంటారు. దాంతో ఆ విభాగానికి సంబంధించిన సేవలకు ఆటంకం కలగకుండా ఎన్‌సీడీ విభాగంలో పని చేస్తున్న వైద్యులతో సేవలందిస్తున్నారు. కణేకల్లు, కళ్యాణదుర్గం నుంచి తాత్కాలికంగా ఇద్దరు వైద్యులను డిప్యూటేషన్‌పై నియమించినా వారు సమయానికి రావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

స్టాఫ్‌నర్సులపై పని భారం

ఆసుపత్రిలో నలుగురు హెడ్‌నర్సులు ఉండగా ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. వీరిని మూడు షిఫ్టుల్లో నియమించాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రాత్రివేళ హెడ్ నర్సును నియమించలేదు. దాంతో స్టాఫ్ నర్సులపై భారం పడుతుంది. మొత్తం 14 మంది స్టాఫ్ నర్సులతోపాటు ఎన్‌సీడీ విభాగానికి సంబంధించి మరో నలుగురు అదనంగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మందిని లేబర్ వార్డుకే నియమించారు. జనరల్ వార్డుల్లో పురుషులు, స్త్రీలు, చిన్న పిల్లల విభాగానికి సంబంధించి ఒక్కో షిఫ్టులో ఇద్దరే పని చేస్తుండటంతో ఒక్కో స్టాఫ్ నర్సు రెండు విభాగాలను పర్యవేక్షించాల్సి వస్తోంది.



రోగులను పరీక్షిస్తున్న ఎన్‌సీడీ విభాగం వైద్యురాలు

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం..

- డా.దేవిడ్, ఇన్‌ఛార్జి డీసీహెచ్ఎస్, అనంతపురం

రాయదుర్గంలో వైద్యులు సెలవుపై వెళ్లిన విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆ వైద్యులు విధులకు వస్తారా లేదా అనే విషయంపై రాష్ట్ర స్థాయి అధికారులు మాట్లాడతామని చెప్పారు. ఒకవేళ రాకుంటే కమిషనర్ ఆదేశాలతో వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకుంటాం.



శ్రీవారికి అన్నకూటోత్సవ సేవ

గుంతకల్లులోని రాజేంద్రనగర్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రులను పురస్కరించుకొని గురువారం అన్న కూటోత్సవ సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 రకాల నైవేద్యాలు సమర్పించి ఉత్సవమూర్తుల వద్ద పులిహోరతో స్వామిని అలంకరణ చేసి పూజలు చేశారు. -న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

జీబీసీకి నీరు విడుదల

ఉరవకొండ, న్యూస్‌టుడే: గుంతకల్లు బ్రాంచ్ కెనాల్(జీబీసీ) అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. కాలువకు 28.5 కిలోమీటరు వద్ద ఇనేల 6న గండి పడిన విషయం తెలిసిందే. మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు అధికారులు గండి పూడ్చారు. ప్రస్తుతం కాలువలో 260 క్యూసెక్కుల మేర నీరు ప్రవహిస్తోంది. ఆయకట్టులోని పంటలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరాను పునరుద్ధరించడంతో రైతులు ఉపశమనం పొందారు.



కాలువలో నీటి ప్రవాహం

భూమి.. మార్కెట్ ధర సమీక్షించాలి

జిల్లా సచివాలయం: ప్రస్తుత భూమి మార్కెట్ ధర ఎంత ఉంటుందన్న దానిపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన తర్వాత నిర్ణయించాలని జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలు నుంచి వీక్షణ సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్, సంబంధిత సమన్వయ శాఖల అధికారులు సంయుక్త పరిశీలన చేసి.. ప్రస్తుత భూమి మార్కెట్ విలువ ఎంత ఉంటుందో నిర్ణయించాలన్నారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నివేదిక పంపాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ధరలను సమీక్షించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, ఆర్డీఓ వసంతబాబు, ఉద్యాన డీడీ నర్సింగరావు, జడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య, భూ సర్వే ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

భళా ఆతిథ్యం.. ఏదీ ప్రాతినిధ్యం?

రంజీ జట్టులో జిల్లాకు దక్కని చోటు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: దులీప్ ట్రోఫీ, రంజీ ట్రోఫీ, దివ్యాంగుల జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా ఆతిథ్యం అద్భుతమే. ఇది ఎవరూ కాదనలేని అంశం. రాయలసీమ జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా అనంతలో అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్తంగా గ్రామీణ క్రీడాకారులను గుర్తించి సానబెడుతున్నాయి. 25 ఏళ్ల నుంచి క్రికెట్ ఎంతో అభివృద్ధి సాధించడానికి ఆర్డీటీ కృషి ఉంది. నిరంతర క్రికెట్ శిక్షణకు ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఉప కేంద్రాలు ఉన్నాయి. అనంతపురంతోపాటు గుంతకల్లు, కదిరి, బీకే సముద్రం, బత్తలపల్లి, ధర్మవరం, నార్పల, తాడిపత్రి, కళ్యాణదుర్గం, హిందూపురం, పెనుకొండ లాంటి ప్రాంతాల్లో క్రికెట్ శిక్షణ శిబిరాలు ఉన్నాయి. రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల సంఖ్య ఈసారి సున్నాకు చేరింది. గత 25 ఏళ్లలో ఎన్నడూ ఇలా జరగలేదు.



అంతర్జాతీయ ప్రమాణాలతో నెట్ సదుపాయం

అందరూ ఆశించినా..

ప్రతి సీజన్‌లో ముగ్గురికి తక్కువగా కాకుండా జిల్లా నుంచి రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించేవారు. ఇటీవల ఆంధ్ర రంజీ జట్టును ప్రకటించగా అందులో ఒక్కరు కూడా అనంతపురం జిల్లా క్రీడాకారులు లేకపోవడం అందరినీ ఆశ్చర్యంలో పడేసింది. అండర్-23 విభాగంలో ఒక్కరూ ఎంపిక కాపోవడానికి వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయా? అంటూ అనేక మంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆంధ్ర రంజీ జట్టులో డీబీ ప్రశాంత్‌కుమార్, గిరినాథ్ రెడ్డి, షోయబ్, దత్తారెడ్డి ఉన్నారు. సీజన్ ప్రారంభానికి ముందే ముగ్గురిని ఎంపిక చేయగా చివరి రెండు మ్యాచ్‌లకు మరో ముగ్గురిని ఎంపిక చేయడాన్ని కొంతమంది వ్యతిరేకించారు. ఆంధ్ర అండర్-23 విభాగంలో దత్తారెడ్డి, మల్లికార్జున, సంతోష్ గతంలో ఎంపికయ్యారు. ఈసారి దత్తారెడ్డి, మల్లికార్జునలు ఎంపికవుతారని అందరూ అనుకున్నా నిరాశే ఎదురైంది.



అనంతపురం క్రికెట్ మైదానం

రాజకీయ జోక్యంతో..

జిల్లా క్రికెట్ సంఘం, సెలక్షన్ కమిటీల్లో ఉండే సభ్యులు పిల్లల ప్రతిభ ప్రమాణాలను పట్టించుకోకుండా తుది జట్టుకు వారి పిల్లలను ఆడిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. రాజకీయ జోక్యం పెరిగి ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతోందని ఆకాడమీ ప్రతినిధులు బహిరంగంగా వాపోతున్నారు. క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఇటీవల కుమారుడిని అండర్-14 జట్టుకు ఉపసారథిగా ఎంపిక చేయడాన్ని ఓ సీనియర్ క్రికెటర్ బహిరంగంగా వ్యతిరేకించారు. ఏ ప్రాతిపదికన ఆ ఉత్తర్వులిచ్చారని టీమ్ కెప్టెన్ చేతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. క్రికెట్ ఆడుతున్న పిల్లల తల్లిదండ్రులను పదవుల నుంచి తక్షణమే తప్పించాలని పలువురు ఆంధ్ర క్రికెట్ సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇటీవల జిల్లా క్రికెట్ సంఘాన్ని ప్రక్షాళన చేయాలని పలువురు విజ్ఞప్తి చేయడం గమనార్హం.

అవసరానికి మించి సెల్‌ఫోన్ వాడకం అనర్థమే

సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్



సర్వజన వైద్యశాల ఎదుట మానవహారంగా వైద్యులు, విద్యార్థులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో యువత అవసరానికి మించి సెల్‌ఫోన్‌లకే సమయం కేటాయిస్తుండటంతో అనర్థాలు జరుగుతున్నాయని అనంతపురం జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ తెలిపారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైక్రియాట్రిక్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆన్షర్ వీల్స్‌క్లబ్, ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు, వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతలోని సర్వజన వైద్యశాల ఎదుట మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మానవ సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తమకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు కనీసం సలహాదారులనైనా చెప్పుకోవాలని తెలిపారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. పనిచేసే ప్రాంతాల్లో తమ సహచరులతో కలిసి మెలిసి ఉండాలన్నారు. ప్రతి మానసిక సమస్యకు పరిష్కారం ఉందని యువత ఆందోళనకు గురైతే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం మానసిక ఆరోగ్యం అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. వైద్యులు మురళీకృష్ణ, శ్రీనాథ్, ప్రసున, మనోరంజన్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు పాల్గొన్నారు.

అనంత వైద్య విద్యార్థికి జాతీయ స్థాయి బహుమతి



కేశవరావుకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ మాణిక్యరావు, వైద్యులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: పాండిచ్చేరిలోని శ్రీవెంకటేశ్వర వైద్యకళాశాల మరియు రీసెర్చ్ కేంద్రంలో ఈ నెల 7న జాతీయ స్థాయిలో నిర్వహించిన నిరంతర వైద్య విద్య సదస్సులో అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలలో పిథాలజీ విభాగంలో పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి డాక్టర్ కేశవరావు పాల్గొని తాను పరిశోధించిన అంశాన్ని వివరించి ప్రథమ బహుమతిని సాధించాడు. గర్భసంచిలో ఏర్పడే సమస్యలను పరిశోధించి అందులో అరుదైన కణితిని గుర్తించాడు. జాతీయస్థాయి సదస్సులో పాల్గొని పోస్టర్ ప్రజెంటేషన్ ఇవ్వడంతో ప్రథమ బహుమతి దక్కించుకున్నాడు. గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, జ్ఞాపికను ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు.

చింతలరాయుడికి పట్టువస్త్రాల సమర్పణ

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జేసీ దంపతులను మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పట్టువస్త్రాలు అందించిన అనంతరం జేసీ మట్లాడుతూ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



చింతలరాయునికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న జేసీ దంపతులు

అనంత జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా ఇలియాస్ బాషా

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఏఆర్ అదనపు ఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొందరు డీఎస్పీ నుంచి ఉద్యోగోన్నతి పొంది బదిలీ అవుతుండగా, మరికొందరు ఏఎస్పీలకు స్థాన చలనం కల్పించారు. అనంతపురం జిల్లా చిత్తూరులో ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందిన ఎస్.ఇలియాస్ బాషాను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డిని ఎన్నికల సమయంలో ఉన్న తాడికలుల డీజీపీ కార్యాలయానికి సరెండర్ చేశారు. ప్రస్తుతం అతన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఏఎస్పీగా బదిలీ చేశారు. జిల్లాలో డీఎస్పీగా పనిచేస్తున్న జి.మునిరాజు ఉద్యోగోన్నతి పొంది నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వేడుకోలు



ఎమ్మెల్యే అమిలినేనికి విన్నవిస్తున్న బాధితులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు వసూలు చేసుకొని తమను మోసం చేశారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కళ్యాణదుర్గం ప్రజావేదిక వద్దకు చేరుకొని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో తమ బాధను చెప్పుకొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇద్దరు 2022లో మమత (మదనపల్లి), అనిత (శ్రీకాకుళం), అవినాష్‌రెడ్డి (తిరుపతి), ఈశ్వర్ (విజయవాడ) విజయవాడకు పిలిపించారు. తమ నుంచి సుమారు రూ.32 లక్షలు వసూలు చేశారు. రెండేళ్లుగా వారి చుట్టూ తిరుగుతున్నా ఉద్యోగాలు ఇప్పించలేదని, డబ్బు తిరిగి ఇవ్వలేదని వాపోయారు. బంగారు ఆభరణాలు తాకట్టుపెట్టి అప్పులు చేసి రూ.లక్షలు ఇచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించిన స్పందనలో, 2023 ఏప్రిల్‌లో కళ్యాణదుర్గం గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా మోసం చేసిన వారు వైకాపా నాయకుడు, మాజీ మంత్రి అనుచరులు కావడంతో పోలీసులు ఏం చేయలేకపోయారని ఆరోపించారు. అప్పటి నుంచి వారి చుట్టూ తిరిగి వేల రూపాయలు నష్టపోయామని కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన గోపి, వన్నూరస్వామి, ఎర్రిస్వామి, గంగాధర, షాహిద, తిమ్మారెడ్డి, తిప్పేస్వామి, సుమిత్ర, పద్మ, విజయశేఖర్, నాగేంద్రులతోపాటు 14 మంది బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తికి ఫోన్ చేసి మాట్లాడారు. మమత, అనితకు మొత్తాన్ని ఇచ్చినట్టు ఆతడు చెప్పాడు. బాధితులకు నగదు ఎవరిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించగా ఎలాంటి సమాధానం రాలేదు. విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

జిల్లా పంచాయతీ అధికారి అక్రమాలపై ఆరా!

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు పారదర్శకం అంటూనే నిబంధనలు తుంగలో తొక్కారు. వైకాపాతో అంటకాగిన అధికారులను అందలమెక్కించారు. నిబంధనలు పాటించిన అధికారులను అడ్డదిడ్డంగా బదిలీలు చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా బదిలీలు చేసిన తర్వాత జిల్లాల వారీగా విచారణలు చేపట్టారు. ప్రస్తుతం అనంతపురం డీపీఓగా వారం రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన టి.నాగరాజు నాయుడుపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఎంపీడీఓగా పనిచేసిన నాగరాజునాయుడు గత ప్రభుత్వ పెద్దలతో అంటకాగడం వల్ల కర్నూలు డీపీఓగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. మళ్లీ డీఎల్‌డీఓగా పదోన్నతి రావడంతో డీపీఓగానే కొనసాగారు. ఇటీవల కర్నూలులో జరిగిన కింది స్థాయి ఉద్యోగుల బదిలీల్లో భారీగా ఆక్రమాలు వెలుగుచూశాయి. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న 8 మంది జూనియర్ సహాయకుల బదిలీల్లో నిబంధనలు పాటించలేదు. బదిలీల పేరుతో వారికి పనిచేస్తున్న చోటే డిప్యుటేషన్లు ఇచ్చిన విషయంపై ఆరా తీశారు. వైకాపా హయాంలో ఆయన సిబ్బందితో వెట్టిచాకిరి చేయించుకున్న విషయాలపైనా ఆరా తీశారు. కర్నూలు కలెక్టర్ ఉత్తర్వులను సైతం తప్పుదోవ పట్టించి బదిలీలు ఇష్టారాజ్యంగా చేసినట్లు వెల్లడైంది. కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీలను ఆమోదించి చిరునామాగా మార్చిన ఆయన్ను మళ్లీ అనంతపురం డీపీఓగా బదిలీ చేయడాన్ని అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదు. ఇతన్ని ఎలాగైనా సాగనంపాలని కొందరు పావులు కదిపారు. జిల్లా కలెక్టర్ దొరవ చూపి కర్నూలులో చేసిన అవకతవకలపై సర్గన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులే కోరుతున్నారు. గ్రేడ్-1 డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలకు డీపీఓ, డీఎల్‌పీఓలుగా నియమించుకూడదని గతంలో హైకోర్టు కూడా ఉత్తర్వులిచ్చింది. పంచాయతీరాజ్ అధికారులు ఈ ఉత్తర్వులను పట్టించుకోకుండా ఎవరి ఆసులు పరిగణనలోకి తీసుకోలేదనే చర్చ సాగుతోంది. మరోసారి హైకోర్టును ఆశ్రయించాలని కొందరు డీపీఓలు సిద్ధమవుతున్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశామనే దాడులు

వైకాపా ఉపసర్పంచి ఆరోపణ

యాడికి, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నామనే కారణంతోనే తెదేపా నాయకులు తమ ఇళ్లపైకి దాడులకు పూనుకున్నారని వైకాపా ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, కార్యకర్త బాలిరెడ్డి ఆరోపించారు. గురువారం జరిగిన ఘటనపై వారు యాడికిలో మాట్లాడారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లపైకి వచ్చి దాడులకు పూనుకున్నారన్నారు. మండలంలో ప్రభుత్వం కేటాయించిన నాలుగు మద్యం దుకాణాలకు తాము దరఖాస్తు చేశామన్నారు. మద్యం దుకాణాలను దక్కించుకోలేమనే భావనతోనే ఎక్కడ దక్కకుండా పోతాయోనని, ఇళ్లపైకి 50 మందికి పైగా వచ్చి ఇంటి తాళాలు పగలగొట్టి నానా హంగామా చేశారని, మహిళలను దుర్భాషలాడి దారుణంగా ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్‌ను వాహనంలో ఎత్తుకెళ్లారని, పోలీసులకు సమాచారం అందించడంతో విడిపించారన్నారు. వైకాపా మండల కన్వీనర్ రమేష్ వచ్చిన వెంటనే డీఎస్పీ వద్దకు వెళ్లి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. దీనిపై తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడిని వివరణ కోరగా దాడుల ఘటనకు సంబంధించి బాధితులు ఇంకా ఫిర్యాదు చేయలేదన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు రైతుల దుర్మరణం

పామిడి, న్యూస్‌టుడే: పామిడిలోని అయ్యప్ప గుడి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో శ్రీరంగయ్య (52) అనే రైతు మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు పామిడిలోని వెంగమునాయుడు కాలనీకి చెందిన శ్రీరంగయ్య బుధవారం రాత్రి పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా అయ్యప్ప గుడి సమీపంలో రాగానే కుక్క అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనలతో కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా గురువారం తెల్లవారుజామున మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

రాప్తాడు: రాప్తాడు మండల కేంద్రం సమీపాన జాతీయ రహదారిపై బెంగళూరు నుంచి యాదగిరి వెళుతున్న కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు రాప్తాడు ఎస్సై హర్ష తెలిపిన వివరాల మేరకు రాప్తాడుకు చెందిన పోతలయ్య గురువారం సాయంత్రం ఇంటికి వెళ్లి రోడ్డు దాటి ఈ క్రమంలో ఇతడిని కారు ఢీకొంది. ఇతను ముందు వెళ్తున్న లక్ష్మీనారాయణను కూడా ఢీకొట్టింది. పోతులయ్య అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. పోతులయ్య (28) రాప్తాడులో వ్యవసాయం, ట్రైలరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. అయ్యవారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణను తీవ్రంగా గాయపడటంతో సవేర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతను సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



పోతులయ్య

తాగొచ్చి గొడవ పడుతున్నాడని..

భర్తను హతమార్చిన భార్య

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని దర్మపురి గ్రామంలో గురువారం దేవరకొండ గోవిందు (60)ను భార్య అంజినమ్మ రోకలిబండతో తలపై మోదడంతో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. గోవిందు వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మద్యం తాగి తరచూ భార్య అంజినమ్మతో గొడవపడేవాడు. వివాహేతర సంబంధం, మద్యం మానేయాలని పలుమార్లు అంజినమ్మ చెప్పినా వినేవాడు కాదు. ఇలాగే గురువారం మధ్యాహ్నం భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత ఇంట్లో నిద్రిస్తుండగా అంజినమ్మ గోవిందు తలపై రోకలి బండతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మవరం గ్రామీణ పోలీసులకు సమాచారం అందడంతో ఇన్‌ఛార్జి సీఐ రెడ్డప్ప, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అంజినమ్మను అదుపులోకి తీసుకొని గ్రామీణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గోవిందు

చీనీ పంట దగ్ధం



కాలిపోయిన చీనీ చెట్లు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పెనకచెర్ల కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డి చీనీచెట్లు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం వల్లనే చీనీ చెట్ల మధ్యలో ఉన్న ఎండిన గడ్డి అంటుకొని వాటి ద్వారా చెలరేగిన పంటలతో ఎండిపోతూ ఉన్న చెట్లు, వ్యవసాయ పరికరాలు సైతం కాలిపోవడంతో సుమారు రూ. 10 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. 9 ఏళ్ల పాటు పెంచిన చీనీ చెట్లు కాయలు బాగా చేతికందే సమయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో భారీగా నష్టపోయామని రైతు ఆవేదన చెందారు. 1050 చీనీ చెట్లు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

బాలుడిని మింగిన కుంట

వజ్రకరూరు, న్యూస్‌టుడే: తల్లిదండ్రులతో కలిసి పంట పొలానికి వెళ్లిన బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందాడు. ఈ ఘటన వజ్రకరూరు మండలంలోని జరుట్లరాంపురం గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబం, గ్రామస్థుల వివరాల మేరకు.. దస్తగిరి, అమీర్ అన్నదమ్ములు. ఇద్దరు కుటుంబసభ్యులతో కలిసి గురువారం వరి పంటకు మందు కొట్టడానికి వెళ్లారు. దస్తగిరి కుమారుడు అఫ్జల్(09)తోపాటు కుమార్తె, అమీర్ కుమార్తె ఆడుకుంటూ పొలం పక్కనే ఉన్న కుంటలో జారి పడ్డారు. అప్పటికే కుంటలో ఈత కొడుతున్న అమీర్ పిల్లల అరుపులు విని కాపాడేందుకు వచ్చాడు. ఇద్దరు ఆడపిల్లలను బయటకు తీశారు. అఫ్జల్ నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యువకులు రెండు గంటలసేపు కుంటలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. కళ్లముందే బాలుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పోగొట్టుకున్న నగదు అందజేత

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం దక్షిణ గొల్లహట్టి సమీపంలో గురువారం మధ్యాహ్నం రోడ్డుపై పడివున్న రూ.2.5 లక్షల నగదు అదే గ్రామానికి చెందిన మండల తెదేపా ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నప్పకు దొరికాయి. పెద్ద మొత్తంలో నగదు దొరకడంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై రామాంజనేయులుకు అందజేశారు. డబ్బులు దొరికిన విషయం సోషల్ మీడియాలో రావడంతో పోగొట్టుకున్న మాజీ జడ్పీటీసీ నరసింహామూర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నగదు తనదేనని చెప్పారు. చెన్నప్ప చేతుల మీదుగా పోలీసులు నరసింహప్పకు నగదు అందజేశారు. పోలీసులు చెన్నప్పను అభినందించారు.

పాతకక్షలతో ఇరువర్గాల దాడులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని వైఎస్సార్ కూడలి సమీపంలో ఉన్న వీధిలో యువకుల పాతకక్షల కారణంగా పరస్పర దాడులు చేసుకున్నారు. పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ గురువారం ఆయా వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన రవితేజకు చెందిన దుకాణం వద్ద రెండు నెలల కిందట మనోజ్ అనే యువకుడు మద్యం మత్తులో మర్తన పద్ధతని తెలిపారు. గురువారం రవితేజ ఇంటిముందు వెళ్తున్న మనోజ్‌ను ఈ విషయంపై నిలదీయడంతో ఇరువర్గాలకు చెందిన యువకులు రాళ్లు, కర్రలతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఇందులో మణికంఠకు గాయాలయ్యాయి. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ ఘటనా స్థలానికి చేరుకుని సమీక్షించారు. ఇరువర్గాలకు చెందిన మనోజ్, సతీష్, సాయికృష్ణ, అరవింద, రవితేజ, మణికంఠ పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

సీఐ తల్లి హత్య కేసులో నిందితురాలి అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సంచలనం సృష్టించిన ధర్మవరం ఒకటోపట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్య కేసులో పరారీలో ఉన్న నిందితురాలిని గురువారం అరెస్టు చేసినట్టు మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గత నెల 28న ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి అదృశ్యం కావడం అనంతరం హత్యకు గురైన విషయం విదితమే. కేసులో మొదటి నిందితుడైన వెంకటేష్ తల్లి బండి ఎల్లమ్మని మదనపల్లె- బెంగళూరు రోడ్డులోని అమ్మాల్ పాలెం దాబా సమీపంలో అరెస్టు చేసి ఆమె నుంచి రూ.లక్ష నగదు సీజ్ చేశామని తెలిపారు. స్వర్ణకుమారిని వెంకటేష్, అతని స్నేహితుడు అనిల్, తల్లి రమాదేవి సుత్తితో కొట్టి చంపేశారు. అనంతరం స్వర్ణకుమారి నగలు తీసుకుని ఫైనాన్స్ సంస్థలో కుదవ పెట్టి రూ.4.97లక్షలు డబ్బు తీసుకున్నారు. అందులో రూ.1 లక్ష నగదు ఎల్లమ్మ తీసుకున్నారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.



ఎల్లమ్మ

చెక్‌బౌన్స్.. ప్రధానోపాధ్యాయురాలికి శిక్ష

పెనుకొండ, న్యూస్‌టుడే: చెక్‌బౌన్సు కేసులో అంజలీలక్ష్మీకళ అనే ఓ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి గురువారం పెనుకొండలోని జూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.బుజ్జప్ప 6 నెలల జైలు శిక్ష, రూ.13.44లక్షల జరిమానా రుసుం విధించారు. కానిస్టేబుల్ బాలీజాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెనుకొండ మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళతో అంజలీలక్ష్మీకళ అప్పు తీసుకుని ఆమెకు చెక్కు ఇచ్చింది. ఆ చెక్కు బౌన్స్ అవడంతో 2022 ఫిబ్రవరి 15న బాధితురాలు కేసు వేసింది. గురువారం ఆ కేసు విచారించిన న్యాయాధికారి ఎం.బుజ్జప్ప శిక్ష విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఒకటిన్నర నెల జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్టు ఆయన వివరించారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

12న వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు వద్ద వేదవతి హగరిపై రూ.48కోట్లతో నిర్మించనున్న ర.భ వంతెన నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 12న దసరా పండగరోజు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శంకుస్థాపన చేయనున్నట్లు ర.భ డీఈ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సాయి కన్‌స్ట్రక్షన్స్ గుత్తేదారు సంస్థ పనులు చేపట్టనుందని తెలిపారు. ఈ సందర్భంగా శంకుస్థాపన చేసేందుకుగాను నిర్మాణం చేపట్టే ప్రదేశంలో మాల్యం వైపు స్థలాన్ని గురువారం తెదేపా నాయకులతో కలిసి పరిశీలించారు. కంప చెట్లు తొలగించి శిలాఫలకం దిమ్మె, వేదిక తదితర ఏర్పాట్లు చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, మాజీ ఉప సర్పంచి ఆనందరాజు, గుత్తేదారు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండగ' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌పీవో వెంకటనాయుడుతో కలిసి నియోజకవర్గంలోని ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఈనెల 14 నుంచి 20 వరకు 'పల్లె పండగ' పంచాయతీలో జరుగనుందని తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు.

రాయితీతో వంట నూనె విక్రయం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పండగ పూట పేదలకు సరసమైన ధరకే పామాయిల్ అందిస్తున్నామని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. గురువారం కళ్యాణదుర్గం ఆయిల్ ట్రేడర్స్ అసోసియేషన్ సహకారంతో కొల్లాపురమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తహసీల్దార్ భాస్కర్, సీఎస్‌డీటీ దుర్గప్రసాద్ ప్రారంభించారు. ప్రస్తుతం పామాయిల్ బయట మార్కెట్లో రూ.130కు అమ్ముతుండగా ఈ విక్రయ కేంద్రంలో రూ.118, సన్‌ఫ్లవర్ నూనె మార్కెట్లో రూ.140కాగా రూ.127కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐ చాంద్‌బాషా, ఉప తహసీల్దార్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు విస్తృతం చేస్తాం



బస్సు వద్ద ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తదితరులు

రాయదుర్గం: రాయదుర్గం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసేందుకు సౌకర్యవంతమైన ఎక్కువ బస్సులను తీసుకురావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో రాయదుర్గం- బళ్లారికి రెండు పల్లె వెలుగు బస్సులను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మరో రెండు సూపర్ లగ్జరీ బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సురేష్‌కుమార్, తెదేపా నాయకులు టంకశాల హనుమంతు, కడ్డిపుడి మహబూబ్‌బాషా, గాజుల వెంకటేశులు, బండిభారతి, ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మారని పంథా.. ఆగని దందా

• రెచ్చిపోతున్న ఇసుకాసురులు



కల్లుదేవనహళ్లి వద్ద ట్రాక్టరులో ఇసుక నింపుతున్న కూలీలు

బొమ్మనహాళ్, రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రింబవళ్లు వేదవతి హగరిని తోడేస్తున్నారు. కళ్లెదుటే ఇసుక తరలిపోతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని కల్లుదేవనహళ్లి, ఉద్దేహాళ్, లింగదహాళ్, శింగానహళ్లిలో విస్తరించిన వేదవతి హగరిలో ఇసుకను తవ్వి నేమకల్లు, ఉరవకొండ, విడపనకల్లు, గుంతకల్లు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.6 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని చింత తోపులో ఇసుకను తోడేయడంతో చెట్లకు ప్రమాదం పొంచి ఉంది. లింగదహాళ్ వద్ద హగరిలో తవ్వకాలతో బోర్లు, పైప్‌లైన్లు దెబ్బతింటున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. సిమెంటు ఇటుకల తయారీ కేంద్రాలకు కూడా ఇసుకను తరలిపోతున్నా చర్యలు శూన్యం.



ఉద్దేహాళ్‌లో సమీపంలోని చింత తోపులో ఇసుక తవ్వకాలతో చెట్లకు పొంచి ఉన్న ముప్పు

వేదవతి హగరిని తోడేస్తున్నారు..

రాయదుర్గం మండలం జుంజురాంపల్లి వద్ద ఇటీవల ఇసుక రీచ్‌ను ఎత్తి వేశారు. అయితే అక్రమార్కులు వేపరాళ్లక్రాస్, రంగచేడు, భూపసముద్రం తదితర గ్రామాల వద్ద వేదవతి హగరిలోని ఇసుకను తోడి రాయదుర్గం పట్టణానికి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ. 2500 నుంచి రూ.3 వేలు వరకు అమ్ముతున్నారు. ఇటీవల గుమ్మఘట్ట పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని వదిలేశారు. దాంతో అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండాపోతుంది. ఈ విషయంపై బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట పోలీసుల వివరణ కోరగా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల బొమ్మనహాళ్ పోలీసులు సరిహద్దులు దాటిస్తున్న ఇసుక టిప్పర్, 10 వరకు ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: శెట్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని యాదవపురంలో రోడ్డు పక్కనే విద్యుత్తు స్తంభాలు, తీగలకు చెట్లకొమ్మలు, పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి, తొలగించాలి. **- భీమప్ప**


సమాధానం: తొలగించేస్తాం. **- వెంకటపతి, లైన్‌ఇన్‌స్పెక్టర్**

సమస్య: డి.హీరేహాళ్ మండలం పాతహగడలి, కాదలూరు గ్రామాల మధ్య వంతెన సమీపంలో గుంతలు పడ్డాయి, పూడ్చండి. **- ఆదెప్ప**

సమాధానం: గుంతలు పూడ్చివేస్తాం. **- రవిశంకర్‌రెడ్డి, ర.భ శాఖ డీఈ**

- న్యూస్‌టుడే, శెట్టూరు, డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం)

సీఐ బాధ్యతల స్వీకరణ



చిన్న గౌస్

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ గ్రామీణ సీఐగా చిన్న గౌస్ గురువారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఆయన అనంతపురం వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సిబ్బంది, పట్టణానికి చెందిన పలువురు నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం ఉప తహసీల్దారు శ్రీరాములు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న నాగరాజు బుక్కరాయసముద్రంకు బదిలీపై వెళ్లారు. ఆర్ఐ పోస్టు చాలా రోజులుగా ఖాళీగా ఉండటంతో పెద్దపప్పూరులో పని చేస్తున్న చాంద్‌బాషాకు బాధ్యతలు అప్పగించారు.

కాలికి గాయం.. బతుకు దుర్భరం

• శస్త్రచికిత్సకు సాయం చేయాలని వేడుకోలు

చిన్న గాయం ఇంటి యజమానిని మంచానికే పరిమితం చేసింది. ఆ కుటుంబాన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టింది. జీవనం దుర్భరంగా మార్చింది. గాయం మానక.. వైద్యానికి చిల్లిగవ్వ లేక నరకయాతన అనుభవిస్తున్నారు. దాతలు పెద్దమనసుతో సాయం చేయాలని వేడుకుంటున్నారు ఆ దంపతులు.



ఈరప్పకు సపర్యలు చేస్తున్న భార్య గోవిందమ్మ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద నివాసం ఉంటున్న ఈరప్ప కూలీ పనులు చేసేవారు. భార్య గోవిందమ్మ ఇంటి వద్ద దోసెలు విక్రయిస్తారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. అందరికీ పెళ్లిళ్లు చేశారు. ఈరప్పకు ఆరు నెలల కిందట చెట్టు కొమ్మ తగిలి కుడి కాలి పాదానికి చిన్న గాయమైంది. వైద్యం చేయించినా నయం కాలేదు. అదికాస్త పెద్దదయ్యింది. రూ.2.50లక్షలు అప్పు తెచ్చి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించారు. అప్పులు తీర్చడానికి, వైద్యానికి ఇల్లు అమ్మేశారు. ప్రస్తుతం కుమార్తెకు చెందిన ఓ చిన్న ఇంట్లో ఉంటున్నారు. ఈరప్పకు గాయం మానకపోవడంతో మంచానికే పరిమితం అయ్యారు. కొన్ని రోజులుగా ఎడమ కాలికి పుండు ఏర్పడింది. ఇంటి వద్దే రోజూ చికిత్స కోసం రూ.1,000 ఖర్చు చేస్తున్నారు. నెలలో రెండుమూడు సార్లు ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఒకసారి వైద్య పరీక్షకు రూ.30వేలు అవుతుందని ఈరప్ప వాపోయారు. మరోసారి శస్త్రచికిత్స చేయాలని, అందుకు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారన్నారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వలేదని కన్నీరు పెట్టారు. దాతలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకొంటున్నారు.

శమీ వృక్షానికి పూజ, ప్రాణప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న దాత, గ్రామస్థులు

గోనబావి (గుమ్మఘట్ట), న్యూస్‌టుడే: మండలంలోని గోనబావి గ్రామంలో విజయదశమి సందర్భంగా శమీ వృక్షానికి గురువారం నూతన కట్టడం నిర్మించి, చెట్టుకు ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. మహంకాళి అమ్మవారికి కలశ స్థాపన చేశారు. పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు నీరుగంటి శ్రీనివాసులు, భార్య లావణ్య పాల్గొని నూతన కట్టడానికి, కార్యక్రమానికి రూ. లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిద్దింటి దానవేంద్ర, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పాటిల్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఊరేగింపు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలోని బెళుగుప్ప తండా గ్రామంలో శుక్రవారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. అందులో భాగంగా గురువారం గ్రామస్థులు, గ్రామ పెద్దలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా లంబాడీ మహిళల నృత్యం ఆకట్టుకుంది. నేడు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రతన్‌టాటా మృతి తీరనిలోటు



రతన్‌టాటా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని తదితరులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార రంగాల్లో సేవలందించిన దిగ్గజం రతన్‌టాటా అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రజావేదిక వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. **రాయదుర్గం:** రతన్‌టాటా మృతికి పట్టణానికి చెందిన ప్రైవేటు పాఠశాలల యజమానులు నివాళి అర్పించారు. ఆ సంఘం నాయకులు రామాంజనేయులు, అయూబ్‌ఖాన్, బాబు తదితరులు పాల్గొన్నారు. **ఉరవకొండ:** రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి గురువారం పేర్కొన్నారు. టాటా పరిశ్రమల ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు.



కళ్యాణదుర్గం గ్రామీణం: దుర్గాదేవిగా మల్లిపల్లి చౌడేశ్వరిమాత




కుందుర్పి రామస్వామి ఆలయంలో..



రాయదుర్గం: లక్ష్మీదేవి అలంకారంలో వాసవీమాత



కణేకల్లు: బాలత్రిపుర సుందరిగా దుర్గాభక్తవత్సలమాత



ఉరవకొండ: దుర్గాదేవిగా ఈశ్వరమ్మ

దుర్గమ్మ.. చల్లగా చూడమ్మా

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం దేవతామూర్తులను వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. **- న్యూస్‌టుడే బృందం**



ఉరవకొండ దుర్గాభవానీ ఆలయంలో..



కంబదూరులో పార్వతీదేవి



కణేకల్లు: మాల్యం సుంకులాంబ

డీలరుపై కేసు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: మండలంలోని రూపానాయక్ తండా గ్రామంలో 36వ చౌక డిపో డీలరు ఉషారాణిపై తహసీల్దార్ నయాజ్ అమ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మహబూబ్ సాహిద్ తెలిపారు. గ్రామస్థులు ఫిర్యాదు మేరకు ఇటీవల సీఎస్‌డీటీ ఆధ్వర్యంలో కార్డుదారులను విచారణ చేసి, డిపోలో రికార్డులను పరిశీలించారు. బియ్యం, రాగులు, జొన్నలు, చక్కెర, మధ్యాహ్న భోజనం పథకానికి చెందిన బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. తహసీల్దార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వీఆర్వోలకు సన్మానం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు, బొమ్మనహాళ్, ఏళంజి వీఆర్వోలు వన్నూరప్ప, తిమ్మప్ప, హరిప్రసాద్ బదిలీ అయ్యారు. వారిని పూలమాలలు, శాలువాతో తహసీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వారు చేసిన సేవలను తహసీల్దార్‌తో పాటు ఉపతహసీల్దార్ శ్యామ్‌రాయ్, రీసర్వే డీటీ లక్ష్మీకాంతనాయక్ కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకిషన్, వీఆర్వోలు నరసింహమూర్తి, రామన్న, యుగంధర్, సుజాత, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా డీలరు అక్కసు

● ఈ-పాస్ యంత్రం పని చేయకుండా గీతలు
● కార్డుదారులకు అందని సరకులు



ఈ-పాస్ యంత్రంపై వేలిముద్ర వేసే చోట గీసిన గీతలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా డీలరు అక్కసు కారణంగా పలువురు కార్డుదారులకు ఈ నెల సరకులు అందలేదు. కళ్యాణదుర్గం మండలం హులికల్లు చౌక డిపో-34ను వైకాపా డీలరు నిర్వహించేవారు. గత నెల 26న పౌరసరఫరాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి నిల్వల్లో తేడాలు ఉండటంతో డిపోను సీజ్ చేశారు. ఆ డిపోను తెదేపాకు చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు. అందుకు సంబంధించిన ఈ-పాస్, తూనిక యంత్రాలతో పాటు నిత్యావసర సరకుల నిల్వలను వైకాపా డీలరు అధికారులకు అందజేయాల్సి ఉంది. కాగా ఈ-పాస్ యంత్రంపై వేలిముద్ర వేసే చోట గీతలు గీసి పనికి రాకుండా చేశాడు. అవకతవకలు బయటపడతాయనే ఉద్దేశంతోనే ఇలా చేశాడని పలువురు ఆరోపిస్తున్నారు. తూనిక యంత్రం కూడా ఇవ్వలేదు. దాంతో 360 మందికి ఈ నెల నిత్యావసర సరకులు అందలేదు. పండగ పూట కార్డుదారులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై తహసీల్దారు భాస్కర్‌ను వివరణ కోరగా ఈ-పాస్ యంత్రానికి మరమ్మతు చేయించాం. తూనిక యంత్రం అందించి కార్డుదారులకు సరకులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడామైదానం శుభ్రం

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్రీడా మైదానాన్ని దాతలు గురువారం పొక్లెయిన్‌తో శుభ్రం చేయించారు. మైదానంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో క్రీడా సాధనకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు దాతలను సంప్రదించగా, శుభ్రత చర్యలు చేపట్టడానికి ముందుకు వచ్చారు. పిచ్చిమొక్కలను తొలగించడంతో పరిసరాలు శుభ్రంగా మారాయి.

తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీ

విడపనకల్లు(ఉరవకొండ), న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరులో గురువారం తూనికలు, కొలతలశాఖ అధికారులు పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. వ్యాపారులు నిర్దేశిత నియమాలను పాటిస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఓ జనరల్ దుకాణం నిర్వాహకుడికి ఆశాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ.20వేలు జరిమానా విధించారు.

'మద్యంతో నేరాలు పెరిగే ప్రమాదం'

రాణినగర్, న్యూస్‌టుడే: మద్యం విచ్చలవిడిగా విక్రయాలు చేయడం వల్ల రాష్ట్రంలో నేరాలు పెరిగే ప్రమాదం ఉందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. గురువారం వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మద్యం షాపుల ఏర్పాటు కోసం 3 లక్షల దరఖాస్తులు అనుకుంటే కనీసం 54 వేల దరఖాస్తులు కూడా అందలేదన్నారు. తక్కువ ధరకే మద్యం అందిస్తామని చెబుతూ మద్యాన్ని విచ్చలవిడిగా తాగించి మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చాలనుకోవడం దురదృష్టకరమన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని భూపసముద్రం వేదావతి హగరి నుంచి రాయదుర్గం పట్టణానికి గురువారం ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులుకు అప్పజెప్పగా ఆయన రూ10వేలు జరిమానా విధించి వదిలేశారు.

వరద కాదు.. మురుగు



మండలంలోని బెస్తరపల్లి గ్రామంలోని వడ్డే కాలనీలో మురుగునీరు నిల్వ చేరి అపరిశుభ్రత నెలకొంది. ఇళ్లలోని వృథా నీరు రోడ్డుపై ప్రవహించి అశ్వర్థకట్ట ఆలయం వద్ద నిల్వ చేరుతుంది. అడుగు వేయలేని పరిస్థితి ఉందని, భరించలేని దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోయారు. పారిశుద్ధ్య పనులు చేపట్టి, సమస్య పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

గుంతల దారిలో గుండె గుబేల్

రాయదుర్గం- కణేకల్లు ర.భ ప్రధాన రహదారి కొంతానపల్లి గ్రామం వద్ద, ఆర్‌బి వంక గేట్ కింద అడవి సమీపంలో గుంతలమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. వేగంగా వస్తున్న వాహనాలు గుంతలు చూడకపోవడంతో ప్రయాణికులు కిందపడి తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుంతలు పడిన చోట్ల మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం గ్రామీణం**



చెత్త రిక్షాలు మూలకు



ఉరవకొండ మండలంలోని షేక్షానుపల్లికి స్వచ్ఛభారత్ కింద కేటాయించిన చెత్త తరలించే రిక్షాలు మూలన పెట్టారు. అవి తుప్పు పట్టి, పనికి రాకుండా పోతున్నాయి. దాంతో గ్రామంలోని వీధుల్లో చెత్తాచెదారం తొలగింపు ప్రశ్నార్థకంగా మారింది. రిక్షాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర దృష్టికి తీసుకెళ్లగా రిక్షాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

యోగ, వ్యాయామంతో ఆరోగ్యం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం వైద్య సిబ్బంది ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఉద్దేహాళ్, గోనేహాళ్ తదితర గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది సీహెచ్‌ఓ నాగమణి, ఎంపీహెచ్‌ఈవో శివప్రసాద్, సూపర్ వైజర్లు ఉమాదేవి, విజయ భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని 150 దేశాలకుపైనే ఈకార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. మనిషి శారీరక, మానసిక, సామాజిక ప్రవర్తన కలిగి ఉన్నప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. వ్యాయామం, యోగా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, వెంకటరమణ, ఈశ్వరమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ముందు మురుగునీరు నిలబడి అపరిశుభ్రంగా మారడంతో పాఠశాల కమిటీ ఛైర్మన్ చెన్నప్ప గ్రావెల్ తోలి చదును చేయించారు. విద్యార్థులు ప్రధాన ద్వారం దాటి లోపలికి వెళ్లేందుకు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం సమస్య తీరడంతో మాజీ సర్పంచి కేశప్ప, తెదేపా నాయకులు వీఎల్ రామాంజనేయులు, ఆనంద్, రఫీ, ముక్కన్న తదితరులు చెన్నప్పను అభినందించారు.

ఇసుక తరలింపు ప్రారంభం



నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని రచ్చుమర్రి స్టాక్ యార్డ్ నుంచి గురువారం ఇసుక తరలింపును అధికారులు ప్రారంభించారు. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వార బుకింగ్‌కు అనుమతులు మంజూరు చేయడంతో, తరలింపు ప్రారంభమైంది. గతంలో వైకాపా నాయకులు అక్రమంగా తరలించేందుకు 12786 క్యూబిక్ మీటర్ల ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించి మైన్స్ అధికారులు సీజ్ చేశారు. ఇసుక స్టాక్‌యార్డ్‌ను కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దారు ఫణికుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ద్వార బుకింగ్ చేసుకొని, స్టాక్‌యార్డ్ నుంచి ఇసుక తరలింపునకు సాంకేతిక సమస్య ఎదురైంది. యాప్ పని చేయకపోవడంతో ఇసుక తీసుకెళ్లేందుకు ఉదయం వచ్చిన టిప్పర్లు సాయంత్రం వరకు కదలలేదు. మైన్స్ అధికారుల సమన్వయంతో సాంకేతిక సమస్యను అధిగమించి సజావుగా తరలింపునకు చర్యలు చేపడతామని ఆర్డీఓ వెల్లడించారు. స్టాక్‌యార్డ్‌లలో ఇసుక నిల్వలు ఖాళీ అవగానే ప్రైవేటు ఏజెన్సీల ద్వార త్వరలోనే ఇసుక రేవుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్చెల్సీ వద్ద రైతు అదృశ్యం

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన రైతు కిశోర్‌కుమార్ గురువారం హెచ్చెల్సీ వద్ద అదృశ్యమయ్యాడు. స్థానికులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసుల వివరాల మేరకు.. వ్యవసాయంతో పాటు బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాల్ క్రాస్ వద్ద మోటారు వైండింగ్ షాప్ నిర్వహించేవాడు. ఇతనికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె బీటెక్, చిన్న కుమార్తె పదోతరగతి చదువుతోంది. మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్యభర్తల నడుమ తరచూ వాగ్వాదం చోటు చేసుకొనేది. గురువారం సాయంత్రం తన ద్విచక్ర వాహనాన్ని హెచ్చెల్సీ 6ఎ డిస్ట్రిబ్యూటరీ వద్ద గట్టుపై నిలిపి ఉంచాడు. సెల్‌ఫోన్, పర్సు దానిపై ఉంచి అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యులు పోలీసుల సహకారంతో హెచ్చెల్సీలో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. రాత్రి 8గంటలైనా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. అదృశ్యమయ్యాడా? హెచ్చెల్సీలో గల్లంతయ్యాడా అన్న సందేహం నెలకొంది.

అనంతపురంలో విద్యార్థిని..

అనంత నేరవార్తలు: అనంతపురం నగరం మూడో పట్టణ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. కూడేరు మండలానికి చెందిన అమ్మాయి అనంతపురంలో ఉంటూ చదువుకుంటోంది. ఐదు రోజుల క్రితం ఆమె ఉంటున్న ప్రైవేటు వసతిగృహం నుంచి కళాశాలకు వెళ్లింది. తిరిగి వెళ్లలేదు. విషయం విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం మూడో పట్టణ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు.

తట్రకల్లులో ఒకరు..

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికిన ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మహబూబ్ సాహిద్ తెలిపారు.

పండగకు కందిపప్పు ఉడికేనా?



రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, న్యూస్‌టుడే: దసరా పండగకు కందిపప్పు ఉడికే పరిస్థితి కనబడటం లేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180కు పైగా ధర పలుకుతోంది. చౌక దుకాణాల్లో బియ్యం, చక్కెర, జొన్నలు ముందుగా వేశారు. కందిపప్పును ఆలస్యంగా సరఫరా చేయటంతో ఎక్కువ మందికి సమాచారం అందలేదు. దాంతో కార్డుదారులు డిపోల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు డీలర్లు కందిపప్పు వచ్చినా పంపిణీలో జాప్యం చేస్తున్నారు. రాయదుర్గం పట్టణానికి 90 శాతం మేర కందిపప్పును సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతుండగా.. మండల కేంద్రాల్లోని కార్డుదారులకు ముందుగా సరఫరా చేసి ఆ తర్వాత స్టాకు వస్తే గ్రామాలకు పంపిణీ చేసే యోచనలో ఉన్నారు.

అరకొరగా సరఫరా: ● రాయదుర్గం స్టాక్ పాయింట్ పరిధిలోని రాయదుర్గం పట్టణంతోపాటు మండలం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల్లో మొత్తం 59,870 కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుకు కిలో చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే 25 టన్నులు(25వేల కేజీలు) మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 34,870 కేజీలు రావాల్సి ఉంది.

● కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో 37,777 కార్డులు ఉండగా 25,000 కిలోలు మాత్రమే సరఫరా అయ్యింది.

● కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కుందుర్పి, శెట్టూరు, కంబదూరు మండలాలకు 1,020 క్వింటాళ్లు కందిపప్పు అవసరం ఉండగా కేవలం 270 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి.

● ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో మొత్తం రేషన్‌కార్డులు 65 వేలు ఉన్నాయి. వీటికి 60 టన్నుల కందిపప్పు అవసరం కాగా 30 టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. విడపనకల్లు మండలానికి అస్సలు సరఫరా చేయలేదు.

గుంతకల్లు

●గుంతకల్లు ●శింగనమల ●తాడిపత్రి



పూజల్లో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తదితరులు

పెద్దమ్మతల్లికి ఎమ్మెల్యే పూజలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రంలో వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలో వర్షాలు బాగా కురవాలని, పంటలు పండాలని మొక్కుకున్నారు. తెదేపా నాయకులు శ్రీరామిరెడ్డి, నారాయణస్వామి, కేశన్న, రవీంద్ర, ఓబుళపతి పాల్గొన్నారు.

వైభవంగా గంధం వేడుకలు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి పట్టణంలో కుంటకట్టపై వెలిసిన సికిందర్ హాజీవలి బాబా ఉరుసు వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం వెకువజామున పవిత్ర గంధాన్ని భక్తి ప్రవచనాల మధ్య ఊరేగించారు. ఉరుసు సందర్భంగా దర్గాను వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం బాబా సమాధిని దర్శించుకుని భక్తులు చదివింపులు చేశారు. దర్గా కమీటీ సభ్యులు పాల్గొన్నారు.



గంధాన్ని ఊరేగిస్తున్న ముస్లిం సోదరులు

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పరిసరాల్లో ఆటో బోల్తాపడటంతో కూలీలు గాయపడిన ఘటన గురువారం సాయంత్రం జరిగింది. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన 9 మంది కూలీలు తాడిపత్రికి వచ్చి తిరిగి ఆటోలో బయలుదేరారు. ఆటోనగర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించేందుకు ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో పల్టీలు కొట్టింది. ఆటోలో ఉన్న ఎర్రిస్వామి, వెంకటరంగయ్య, రంగస్వామి తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆగురుగురికి స్వల్పగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ వివరించారు.

పెనకచెర్ల సమీపంలో మరో ఇద్దరికి..

గార్లదిన్నె, న్యూస్‌టుడే : పెనకచెర్ల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. డ్యామ్ గ్రామం నుంచి యర్రగుంట్ల వైపు ద్విచక్రవాహనంపై పాండురంగడు, రాధ వస్తుండగా అదే మార్గంలో వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఆక్రమణదారులకు నోటీసులు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిఆర్.ఎస్.లోని కర్నూలు రోడ్డులో కాలువలను ఆక్రమించిన వారికి పురపాలిక అధికారులు నోటీసులను జారీ చేశారు. మెయిన్ బజార్ నుంచి వీరభద్రస్వామి గుడి వరకు ప్రజలు కాలువలను ఆక్రమించారు. కాలువలపై కొందరు బండలు వేసుకోగా మరి కొందరు స్నానపు గదులను, మరుగుదొడ్లను నిర్మించారు. దీంతో కమిషనర్ జబ్బార్‌మియా 58 మందికి ఆక్రమణలను మూడు రోజుల్లో తొలగించుకోవాలని ఆదేశిస్తూ నోటీసులు ఇచ్చారు.

రాయితీతో వంట నూనెల విక్రయం

గార్లదిన్నె, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు తక్కువ ధరకే వంటనూనెలు అందజేయాలనే ఉద్దేశంతో గార్లదిన్నెలో ఆయిల్ ట్రేడింగ్ దుకాణాలను గురువారం తహసీల్దారు ఈరమ్మ ప్రారంభించారు. ప్రైవేటు దుకాణాల్లో అమ్మే ధరలకంటే తక్కువ ధరలకు నాణ్యమైన వంటనూనెలు అందజేయనున్నట్లు తహసీల్దారు ఈరమ్మ తెలిపారు.

నాలుగు వరుసల గుంతల రహదారి

● వాహన రాకపోకలకు తప్పని పాట్లు

గుంతకల్లు, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లు - కసాపురం నాలుగు వరుసల రోడ్డు గుంతలతో దర్శనమిస్తోంది. ఈమార్గం గుండానే ప్రయాణికులు కర్నూలుకు వెళ్తారు. గుంతకల్లు - కసాపురం మధ్య మూడు కిలోమీటర్లు ఉండగా కసాపురం నుంచి జిల్లా హద్దువరకు మరో నాలుగు కిలోమీటర్ల పొడవైన రోడ్డు ఉంది. పట్టణంలోని సత్యనారాయణపేట నుంచి కసాపురం వరకు మాత్రమే నాలుగు వరుసల రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు ఎనిమిదేళ్ల కిందట నిర్మించారు. ఈ మార్గంలో నిమిషానికి 30కి తక్కువ కాకుండా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డును నిర్మించే సమయంలో వర్షం నీరు ఆగే ప్రదేశాల్లో కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నీరు తారురోడ్డుపై ఆగడంతో విపరీతంగా గుంతలు పడుతున్నాయి.



గుంతకల్లు - కసాపురం మార్గంలో అధ్వానంగా రహదారి

అడుగడుగునా సమస్యే

గుంతకల్లు - కసాపురం మధ్య ఉన్న రోడ్డులో అంజలీనగర్, అయ్యప్పస్వామి ఆలయం, దత్తాత్రేయస్వామి ఆలయం వద్దనే కాకుండా మరికొన్ని చోట్ల పెద్దఎత్తున గుంతలు దర్శనమిస్తున్నాయి. గుంతలున్న సంగతి దూరప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే వాహన చోదకులకు తెలియక పోతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. గుంతలున్న చోట తాత్కాలిక పనులు చేస్తున్నా వారం రోజులు గడవకముందే యథాస్థితికి వస్తోంది. ఫలితంగా కసాపురం నుంచి జిల్లా సరిహద్దు వరకు రహదారి దారుణంగా మారింది.



అయ్యప్పస్వామి ఆలయం వద్ద దెబ్బతిన్న రోడ్డు

ప్రతిపాదనలు పంపాం - సత్యనారాయణ, డీఈ, రహదారులు భవనములశాఖ

గుంతకల్లు - కసాపురం మధ్య నాలుగు వరుసల రోడ్డులో అక్కడక్కడ గుంతలు పడిన విషయం వాస్తవమే. మరమ్మతులు చేయడానికి రూ. 20 లక్షల వరకు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించాం. అంతే కాకుండా కసాపురం - గుంతకల్లు మధ్య రోడ్డును ఆధునికీకరించడానికి, కసాపురం నుంచి జిల్లా హద్దువరకు నాలుగు వరుసల రోడ్డును నిర్మించడానికి రూ. 14 కోట్లతో అంచనాలు రూపొందించి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపడతాం.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో కలెక్టరేట్‌కు వెళ్లే చెరువుకట్ట రోడ్డు పక్కన కొందరు వ్యక్తులు వ్యర్థాలు పడేసి తరచూ నిప్పు పెడుతున్నారు.



- నారాయణస్వామి, బుక్కరాయసముద్రం

సమాధానం: చెరువుకట్టపై వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-సదాశివ,ఈవోఆర్డీ** – న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: తాడిపత్రికి చెందిన విద్యార్థులు తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా తెలిపారు. ఈనెల 6,7,8వ తేదీల్లో జరిగిన అండర్ 14, 17 విభాగాల్లో సాయి చైతన్య పాఠశాల విద్యార్థిని లలిత 42 కిలోల విభాగంలో కాంస్య పతకం, శ్రీవాణి పాఠశాల విద్యార్థి భరత్ 35 కిలోల విభాగంలో రజతం, చర్చి పాఠశాల విద్యార్థి రాకేష్ 78 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు.



ప్రతిభ చూపిన విద్యార్థులు

పాఠశాల భవనం బాగు చేయరూ!

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలోని నాగిరెడ్డి కాలనీలోని పాఠశాల భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ కొన్నేళ్ల కిందట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉండేది. విద్యార్థులు లేరన్న నెపంతో అప్పటి ప్రభుత్వం పాఠశాలను మూసివేసింది. దీంతో ఖాళీగా ఉన్న ఈ పాఠశాల భవనం అంగన్‌వాడీ కేంద్రంగా మార్చారు. వర్షాకాలంలో కారుతుండటం, దీనికి తోడు ఆవరణలోకి వర్షం నీరు చేరడం వంటి కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలనీకి సీసీ వేయడంతో పాఠశాల భవనం తగ్గులోకి వెళ్లింది. ఈ కారణంగా అంగన్‌వాడీ కేంద్రం మూతబడింది. ప్రస్తుతం ఈ భవనంలో లోపల పరిశీలిస్తే దుర్వాసన, తాగిపడేసిన సీసాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు 3సెంట్ల విస్తీర్ణంలో గల ఈ భవనంలో అర్ధరాత్రి వరకు కొందరు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారు. చుట్టూ ఇళ్ల మధ్య ఉన్న ఈ భవనంలో ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. ఈ భవనానికి పక్కన ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనంపై అధికారులు దృష్టి సారించి తమ పిల్లలకు వసతులతో కూడిన అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని వర్సిటీ డీన్ శీలారెడ్డి తెలిపారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వర్సిటీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వర్సిటీలో మైమ్ షో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆచార్యులు రోహిణి, శివానంద, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మండలంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. భాజపా జిల్లా ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ పొట్టెగంగాధర్, మండల అధ్యక్షుడు చింతాచౌదయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతి జగదీశ్ పాల్గొన్నారు.

వధూవరులకు సీఐ కానుక

యాడికి, న్యూస్‌టుడే: త్వరలో పెళ్లి చేసుకోబోయే వధూవరులకు యాడికి సీఐ ఈరన్న కానుకలను అందజేశారు. గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన మీనుగ వన్నప్ప తన కుమారుడు వన్నూరుస్వామి వివాహానికి సీఐని ఆహ్వానిస్తూ, తనకు ఆర్థికంగా సాయం చేయాలని అర్థించారు. సీఐ మానవతాదృక్పథంతో స్పందించి తాళి బొట్టు, మెట్టెలతో పాటు దుస్తులను అందజేశారు. ఏఎస్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల సేవలకు చేయూత

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలోని వైద్య విధాన ఆసుపత్రికి యాడికి మండలం సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం పలు పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఆనందరావు మాట్లాడుతూ రోగుల సమస్యలను గుర్తించి సాగర్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా రూ. 6లక్షలు విలువ చేసే పరికరాలు అందజేసినట్లు తెలిపారు. రోగులు కూర్చునేందుకు స్టీల్ కుర్చీలు, వాటర్ డిస్పెన్సర్, కుకింగ్ పాత్రలు, ఇన్వర్టర్ అందజేసినట్లు తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులు రంగారెడ్డి, జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి, ఏజీఎం శ్రీమన్నారాయణ, తదితర ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

పామిడి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా నిత్యావసర సరకులను గురువారం పామిడి బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నిర్ణయం మేరకు తెదేపా ప్రభుత్వం 100 రోజుల పాలనకు గుర్తుగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుక అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పేద మహిళలకు చీరల అందజేత

గుంతకల్లు, న్యూస్‌టుడే : దసరా పండగను పురస్కరించుకుని సంచారజాతులు, ప్రగతిశీల మహిళా సమైక్య సంఘం అధ్యక్షురాలు ఇందిరమ్మ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పేద మహిళల చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. పండుగనాడు నిరుపేద మహిళలు చీరలు లేవని బాధపడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెదేపా నాయకుడు నారాయణస్వామి, తెదేపా డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షురాలు హిమబిందు చేతుల మీదుగా చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. తెదేపా లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, భాజాపా మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, తెదేపా నాయకులు రామన్నచౌదరి, మస్తానప్ప, జనసేన నాయకుడు బండి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి సాయం

గుత్తి, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో జనసేన కార్యకర్త ధనుంజయ ఇటీవల మృతిచెందగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేయూత అందించారు. పార్టీ నియోజకవర్గ బాధ్యుడు మణికంఠ, గుత్తిమండల నాయకులు చిన్నవెంకటేశ్, సురేశ్, బ్రహ్మయ్య తదితరులు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ధనుంజయ కుటుంబీకులకు ఇచ్చారు.

రతన్‌టాటా మృతికి సంతాపం

తాడిపత్రి, న్యూస్‌టుడే: పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతికి తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

విద్యుత్తు నియంత్రిక ధ్వంసం

శింగనమల, న్యూస్‌టుడే : కల్లుమడిలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నాగార్జునరెడ్డి అనే రైతు పొలంలోని నియంత్రికను కింద పడేశారు. నియంత్రికను ధ్వంసం చేసి వాటిలోని రాగి తీగలను ఎత్తుకెళ్లారు. సీఐ కౌలుట్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల జప్తు

తాడిపత్రి : పెన్నానదిలో పలు చోట్ల అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను జప్తు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. రసూల్, జయకృష్ణ, రవీంద్ర, లక్ష్మయ్య, రాములకు చెందిన ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పాత గుంతకల్లులో నూర్ మహమ్మద్ అనే మట్కా నిర్వాహకుడిని గురువారం అరెస్టు చేసి రూ.34 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. పాత గుంతకల్లు కుమరం కట్ట ఏరియాలో మట్కా రాస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కల్లూరులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పెద్దవడుగూరులో దుర్గాదేవిగా చౌడేశ్వరి



యాడికిలో మహిషాసురమర్దిగా



బుక్కరాయసముద్రంలో గాజుల అలంకరణలో



గార్లదిన్నెలో భ్రమరాంబదేవి



తాడిపత్రిలో.. దుర్గాదేవిగా



పాత గుంతకల్లు : దుర్గాదేవిగా త్రిపుర సుందరీదేవి



గుంతకల్లు పట్టణం: మహిషాసుర మర్దినిగా కన్యకా పరమేశ్వరి

దసరా శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో గురువారం అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.


- న్యూస్‌టుడే బృందం



శింగనమల: అలంకరణలో అమ్మవారు



వడియంపేటలో.. అంకాలమ్మ



తాడిపత్రిలో.. మహిషాసురమర్దినిగా

మరమ్మతులకు నోచుకోని పవర్ బోరు

గుంతకల్లులోని మిల్లు కాలనీలో చిన్న రాగిమాను కట్ట వద్ద ఉన్న పవర్ బోరు మరమ్మతులకు గురైంది. బోరు నుంచి సింటెక్స్ ట్యాంక్‌కు నీరు సరఫరా కావటం లేదు. రెండు వారాలుగా ఇదే సమస్య. సచివాలయ ఉద్యోగులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై 4వ సచివాలయం కార్యదర్శి ధనుంజయను వివరణ కోరగా త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం



ప్రభుత్వం మారినా పేర్లు మారలే!



కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా గ్రామ సచివాలయాల్లో జగనన్న చిత్రాలు, వారి ప్రభుత్వ పథకాల పేర్లు అలాగే దర్శనమిస్తున్నాయి. మండలంలోని పెద్దమల్లేపల్లె, చిలమకూరు తదితర సచివాలయ కార్యాలయాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, యల్లనూరు

ప్రమాదాన్ని తప్పించండి

గుంతకల్లు పట్టణానికి రెండు కి.మీ.ల దూరంలో బళ్లారి వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో గుంత పడింది. ఇది దగ్గరికి వెళ్తే తప్ప కనిపించటం లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు రావడం వల్ల సమీపంలోనే మరికొన్ని గుంతలు పడ్డాయి. రాత్రి సమయంలో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. గుంతలు పూడ్చాలని ప్రయాణికులు ఎన్‌హెచ్ అధికారులను కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

పండగ పూట.. ధరల మంట

● విపణిలో ఏమీ కొనలేని పరిస్థితి
● లబోదిబోమంటున్న సామాన్యులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు దినసరి మార్కెట్‌లో కూరగాయల, నిత్యావసర సరకులు ధరలు భగ్గుమంటున్నాయి. ఆర్థిక భారంతో సామ్యానులు కొనలేని పరిస్థితిలో ఉన్నారు. కొన్ని కూరగాయలు, నిత్యావసర సరకులు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పండగ సమయల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మదనపల్లి ప్రాంతాల్లో సాగు తగ్గి..

గుంతకల్లులోని వ్యాపారులు మదనపల్లి ప్రాంతాల్లో పండించే టమాటా, వంకాయలు, బెండ తదితర వాటిని వారానికి ఒకసారి దిగుమతి చేసుకుంటారు. వర్షాలతో పంట సాగు తగ్గడంతో సరకు లేక ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. నెల కిందట కిలో టమాటా రూ.15 వరకు ఉండేది. ఇప్పుడు కిలో టమాటా రూ.80, వంకాయలు కిలో రూ.80 వరకు పలుకుతోంది.

కంది పప్పు, తెల్లగడ్డలు కొనలేం

కిరాణా దుకాణాల్లో లీటరు వంట నూనె ప్యాకెట్ రూ.170, కందిపప్పు కిలో రూ.185 వరకు ఉంది. రెండు నెలల కిందట వెల్లుల్లి కిలో రూ.150 పలికింది. ఇప్పుడు రూ.400 ఉంది. ఈ ధరలను చూసి సామాన్యులు వణికిపోతున్నారు.



గుంతకల్లు కూరగాయల మార్కెట్

పూట గడవడం కష్టమే



మార్కెట్‌లో నిత్యావసర సరకులు కొనలేకపోతున్నాం. కూలీ పనులకు వెళ్లి జీవనం చేస్తున్నాం. రోజు వారి ఖర్చు వందరూపాయలుపైనే వస్తోంది. తెల్లగడ్డలు కిలో రూ.400 అంట. ఇలాగైతే కుటుంబం గడవడం కష్టమే.

- సాయి ప్రేమ, దినకూలీ, సీఐటీయూ కాలనీ

నిత్యావసర సరకులూ అంతే



మార్కెట్‌లో కూరగాయలు, నిత్యావసర ధరలు పెరిగిపోయాయి. గత నెల కిలో టమాటా రూ.20 ఉండేది. ఇప్పుడు రూ.80కి చేరింది. పెరిగిన ధరలతో మా లాంటి పేదలకు కష్టాలు ఎక్కువ అవుతున్నాయి.

- వరలక్ష్మి, దినకూలీ, సీఐటీయూ కాలనీ

ప్రభుత్వం దృష్టికి దళితుల సమస్యలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంటున్న దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించేందుకు తమ వంతు కృషిచేస్తామని డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్‌కు కొత్తగా నియమితులైన సభ్యులు అన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఆర్డీఓ శ్రీనివాసులును సన్మానించారు. కమిటీ సభ్యులు హరిప్రసాద్ యాదవ్, రవి, గోవిందు, మల్లికార్జునతో పాటు ఎరుకల ప్రజాసమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు శేఖర్, బాబయ్య, నల్లప్ప, నరేశ్ పాల్గొన్నారు.



ఆర్డీఓ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యులు

నిద్రలేమితో అనారోగ్యం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారి యుగేంద్ర హాజరయ్యారు. వైద్యాధికారులు కల్యాణ చక్రవర్తి, అరుణ, హరిత సమక్షంలో జిల్లా అధికారి మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిద్రలేమితోనే రోగాలు వస్తాయన్నారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

అమాయకులపై రౌడీషీట్లు తొలగించాలి: సీపీఐ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి నేరచరిత్ర లేని అమాయకులపై రౌడీషీట్లను తెరిపించిందని, వాటిని తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఎస్పీ జగదీశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో మంచినీటి కుళాయి దగ్గర జరిగే గొడవలకు కూడా కొందరిపై రౌడీషీట్ తెరిచారన్నారు. వైకాపా ప్రభుత్వం విధానాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పైన ఆందోళన చేసిన కమ్యూనిస్టు, దాని అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాల నాయకుల పైన సైతం షీట్లు ఓపెన్ చేశారన్నారు.

యోగాసనాల పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్‌కు అభినందన

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి యోగాసనాల పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్ ఎం.చలపతిని, జిల్లాల నుంచి రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో ప్రశంసా పత్రం పొందిన మహిళా కానిస్టేబుల్ జి.దీపను ఎస్పీ జగదీశ్ అభినందించారు. జిల్లా పోలీసు శాఖలో చలపతి, దీపలు కానిస్టేబుళ్లుగా పని చేస్తున్నారు. ఇద్దరూ ఈ నెల 5 నుంచి 7 వరకు కర్నూల్లోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్ గ్రూప్ బి పురుషుల విభాగంలో చలపతి రెండో స్థానం, సీనియర్ గ్రూప్..బి మహిళా విభాగంలో దీప ఐదో స్థానం కైవసం చేసుకున్నారు. వీరిలో చలపతి త్వరలో కర్ణాటక రాష్ట్ర మైసూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నేడు శివకోటి శ్రీపీఠంలో చండీయాగం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న శివకోటి శ్రీపీఠంలో శరన్నవ రాత్రుల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి సందర్భంగా నవ చండీ యాగం, మహిష మర్దిని, ఆవరణ పూజలు, గణపతి, రుద్ర, నవగ్రహ హోమాలు ఉంటాయని ఆలయం కమిటీ తెలిపింది. చండీ యాగం చేయబోయే వారు ఆలయంలో ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు. విజయదశమి సందర్భంగా అపరాజిత పూజలు, రజత అలంకారములు, సాయంత్రం 6గంటలకు శమి దుర్గాపూజ, ఊంజల్ సేవ, రాజోపచార పూజలు ఉంటాయన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఏడీసీఏ కృతజ్ఞతలు

అనంతపురం (క్రీడలు, న్యూస్‌టుడే: గత నెలలో జరిగిన దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలను విజయవంతం చేయడానికి సంపూర్ణ సహకారం అందించిన కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్‌కు జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, కార్యదర్శి మధు ఆచారి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, శిక్షకుడు యుగంధర్‌రెడ్డి వేరువేరుగా కలిశారు. గత నెల 5 నుంచి 22 వరకు జరిగిన ఐదు పోటీలు విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అందించిన సహకారం చాలా గొప్పదని క్రికెట్ సంఘం సభ్యులు కొనియాడారు.

దివ్యాంగుడికి వాహనం అందజేత

అనంత సంక్షేమం: నగరంలోని బుడ్డప్పనగర్‌లో ఉన్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో ఏడీ అబ్దుల్ రసూల్ దివ్యాంగుడికి మూడు చక్రాల వాహనం అందజేశారు.

మెప్మా పీడీగా విశ్వజ్యోతి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీగా జె.విశ్వజ్యోతిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు మెప్మాలో టీపీఆర్వోగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆమెకు పదోన్నతి కల్పిస్తూనే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించారు.

నిత్యం నీటి వృథా.. ఎవరికీ పట్టని వ్యథ



శ్రీనివాసనగర్‌లోని రామాలయం పక్కవీధి చివరలో ఓ ఇంటి ముందు తాగునీటి పైపునకు కొళాయి లేదు. అవసరం ఉన్నంతవరకూ నీరు పట్టుకొని రోడ్డుపై వదిలేస్తున్నారు. కొళాయిలకు నగరపాలక సిబ్బంది నీరు ఆపే వరకూ ఇలా వృథాగానే పోతోంది. ఇలా చేయవద్దని చెప్పేవారు కూడా లేరు.

న్యూస్‌టుడే: వేణుగోపాల్‌నగర్

నగరంలోని ప్రతి ఇంటికి ప్రతి రోజూ తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో ఆరు సంవత్సరాల క్రితం ఏపీ ఎండీపీ పథకం ప్రారంభించారు. పీఏబీఆర్ జలాశయం నుంచి నగర ప్రజల అవసరాలకు సరిపడే నీటి వనరులు ఉన్నందున ఈ పథకం అమలు చేశారు. రూ. 300 కోట్లు అప్పట్లో మంజూరయ్యాయి. ఈ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. గతంలో కొళాయి కనెక్షన్లు ఉన్న ఇంటికి నీలిరంగు కొళాయి పైపులు జారీ చేశారు. నివాస గుమ్మం వరకూ మాత్రమే నగరపాలక సంస్థ కొళాయి పైపు ఇస్తుంది. అక్కడి నుంచి ఇంటి యజమానులు పైపులు, కొళాయిలు అమర్చుకోవాలి.

● నగరపాలక యంత్రాంగం కొళాయి పైపు కనెక్షన్లు ఇచ్చి వదిలేశారు. చాలాచోట్ల ఇంటి యజమానులు కొళాయిలు అమర్చుకోలేదు. ఇంటి ముందున్న పైపు నుంచి నీరు పట్టుకొంటున్నారే తప్ప, ఆ తరువాత నీరు రోడ్డుపైకి, కాలువల్లోకి వదిలేస్తున్నారు. ప్రతి కాలనీలో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. పీఏబీఆర్ వచ్చే నీరు శుద్ధి చేసిన తరువాత కొళాయిలకు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో నీరు వృథాగా అవుతోంది. సిబ్బంది సాయంతో కొళాయిలు అమర్చుకొనేలా అధికారులు చైతన్య పరచాలి.



రామచంద్రనగర్‌లో రైల్వే స్టేషన్ వద్ద ఓ ఇంటికి ఉన్న తాగునీటి కొళాయి పైపు నుంచి రోజూ తాగునీరు వృథాగా కాలువలోకి వదులుతున్నారు. కొళాయి పైపునకు బిరడా కూడా లేకుండా చేశారు. తాగునీరు కాలువలో కలిసిపోతున్నా పట్టించుకొనేవారు లేరు.

మడుగులా.. రహదారి



రాప్తాడు మండలం బండమీదపల్లిలోని ఓ వీధిలో నీటి నిల్వ మడుగును తలపిస్తోంది. ఈ నీరు కుళాయిల నుంచి వృథాగా వదిలేయగా వచ్చిందే.

- న్యూస్‌టుడే, రాప్తాడు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005 రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

ప్రశ్న: రుద్రంపేట-ఆలమూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం పనులు జరుగుతున్నందున విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు తొలగించారు. ఇబ్బందిగా ఉంది. **- శివప్రసాద్, స్థానికుడు**

ప్రశ్న: చంద్రబాబు నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కూడలిలో వీధి దీపాలు లేక రాకపోకలకు ఇబ్బందిగా ఉంది **- రామయ్య, స్థానికుడు**

జవాబు: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం

- హిదయతుల్లా, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, రుద్రంపేట

జేఎన్‌టీయూ బోధనేతర ఉద్యోగుల బదిలీ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో బోధనేతర ఉద్యోగులు 18 మందిని వివిధ విభాగాలకు గురువారం బదిలీ చేశారు. ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల విభాగంలో డీఆర్‌గా ఉన్న మధుసూదన్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు బదిలీ చేశారు. ఇంజినీరింగ్ కళాశాలలో డీఆర్‌గా ఉన్న దుర్గాప్రసాద్‌ను ఓటీపీఆర్ఐకి బదిలీ చేశారు. ఓటీపీఆర్ఐలో ఏఆర్‌గా ఉన్న శంకర్‌రెడ్డిని పరీక్షల విభాగానికి, ఎస్టాబ్లిస్‌మెంట్ విభాగంలో ఏఆర్‌గా ఉన్న మురళీ మోహన్‌రావును రెక్టార్ పేషీకి బదిలీ చేశారు. ఏఆర్ ప్రభాకర్ కళాశాల వసతిగృహాల కార్యాలయానికి, డీఏపీ కార్యాలయం ఏఆర్ లింగప్ప ఎస్టాబ్లిస్ విభాగానికి బదిలీ అయ్యారు. ఏఆర్ అబ్దుల్‌ఖాదర్‌ను వసతిగృహాల కార్యాలయం నుంచి ఇంజినీరింగ్ కళాశాలకు, అదే విభాగంలో పర్యవేక్షకులుగా ఉన్న శివశంకర్‌గౌడ్‌ను పరీక్షల విభాగానికి బదిలీ చేశారు.

ప్రతి రైతుకూ పప్పుశనగ విత్తన పంపిణీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని నల్లరేగడి నేల ఉన్న ప్రతి రైతుకి పప్పుశనగ విత్తన పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి సుచరిత, తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు పప్పుశనగ విత్తనాన్ని అందించారు.

కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు: ఎమ్మెల్యే



అశోక్‌నగర్‌లో బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్, నాయకులు

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో పాలకులు చేసిన తప్పిదాలతో ప్రస్తుతం ప్రజలకు శాపాలుగా మారాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతపురం నగరం అశోక్‌నగర్‌లో స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే పర్యటించారు. అశోక్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జిపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. తక్కువ ఎత్తులో బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో మురుగు సమస్యను మరింత జఠిలం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకొన్నారని వైకాపా నాయకులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. బ్రిడ్జికి అటు ఇటు సీసీ రహదారి వేయకుండా వదిలేశారన్నారు. మురుగు సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అశోక్‌నగర్‌లో ఇండోర్ స్టేడియంలో జనరేటర్, క్రీడా సామగ్రి మాయం కావడంపై ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో ఓ అధికారి పాత్రపై ఆరోపణలు వచ్చాయని, ఆయనపై విచారించి, నిజం తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

తరతరాలకు రతన్‌టాటా స్ఫూర్తి

అనంతపురం (వ్యవసాయం) : ప్రముఖ ఆటోమొబైల్ రంగ దిగ్గజం రతన్‌టాటా అకాల మరణంతో దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధితో ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే కొనియాడారు.

● అనంతపురం అర్బన్ తెదేపా బీసీ, ఎస్సీ, మైనారిటీ నాయకుల రతన్‌టాటా మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం రాంనగర్‌లోని అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నెలాఖరుకు లక్ష్యాలు పూర్తి చేయండి

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉద్యానశాఖ పథకాలతో పాటు ఎస్సీ, ఎస్టీ కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు ఆదేశించారు. గురువారం జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డితో కలిసి ఉద్యాన పథకాలు సమీక్షలో డీడీహెచ్ మాట్లాడుతూ వివిధ పథకాలు అమలులో క్షేత్రస్థాయిలో ఉద్యానాధికారులంతా పరిశీలించాలన్నారు. ఎక్కడా అవకతవకలు జరగడానికి వీల్లేదన్నారు. రైతులు చేసుకున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో అందజేయాలని హెచ్‌వోలను ఆదేశించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్కేయూ: విద్యావ్యవస్థలో యాప్‌ల భారం తొలగించి, ఉపాధ్యాయులపై మండల విద్యాశాఖాధికారుల ఒత్తిళ్లు తగ్గించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రామలింగప్ప పేర్కొన్నారు. తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశం నేతాజీ నగరపాలకోన్నత పాఠశాలలో గురువారం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ నాడు-నేడు పనులు, సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కొనుగోళ్లలో అవకతవకల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అరవింద్ మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి ప్రారంభం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: నగరంలోని సాయినగర్ మొదటి క్రాస్‌లో అరవింద్ డయాబెటిస్ మల్టీస్పెషాల్టీ ఆసుపత్రి, కంటి ఆసుపత్రిని గురువారం నూతనంగా ఆసుపత్రి ఎండి డయబెటాలజిస్ట్, ఫిజిషియన్ డాక్టర్ జానకీ అరవింద్‌కుమార్ ప్రారంభించారు. అన్ని రకాల ఫిజిషియన్ సేవలు, షుగర్ రోగులకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కంటి ఆసుపత్రిలో ఆధునిక పద్ధతిలో కేటరాక్ట్ సర్జరీకి సంబంధించిన పరీక్షలు డాక్టర్ ప్రియ లిఖితరెడ్డి నిర్వహిస్తారని వెల్లడించారు.



కూడలి.. ఎగుడు దిగుడు

సాయినగర్‌లోని ఏడో క్రాస్ కూడలి రోడ్డు ఎగుడు దిగుడుగా ఉంది. కొంత భాగం కోసుకుపోయింది. వాహనదారులు ఏమాత్రం చూడకుండా వస్తే కింద పడిపోయే స్థితి ఉంది. అంబేడ్కర్ భవన్ వైపు నుంచి ఏడో క్రాస్‌తో ప్రారంభం అయితే జీరో క్రాస్ వరకు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తారు. ప్రధాన కూడలిలో రోడ్డును మరమ్మతు చేయకుండా వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. - **న్యూస్‌టుడే, సాయినగర్**



శివకోటిలో మహాలక్ష్మీదేవిగా



కొత్తూరు అమ్మ వారిశాలలో..

శక్తి స్వరూపిణికి జేజేలు

శరన్నవ వేడుకలు శోభాయమానంగా సాగుతున్నాయి. గురువారం ఆలయాల్లో సందడి నెలకొంది. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే యంత్రాంగం

అవీ.. ఇవీ.. అన్నీ..

నిధుల దుర్వినియోగంపై నిగ్గు తేల్చండి

రాప్తాడు: వైకాపా ప్రభుత్వంలో ఆ నాయకులు చేసిన నిధుల దుర్వినియోగంపై నిగ్గు తేల్చాలని తెదేపా సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. రాప్తాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నిధులతో పనులు చేయకపోయినా మరూరు, బొమ్మేపర్తి చెందిన కొందరి వ్యక్తుల పేరు మీద పని చేసినట్లు చూపి ప్రభుత్వ నిధులు కాజేశారన్నారు. వైకాపా సర్పంచులు సర్పంచి గ్రాంట్స్ దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నాయకులు తమ పొలాల్లో చెట్లు పెట్టకపోయినా రూ.కోట్లలో బిల్లులు చేసుకొని తినేశారని రాప్తాడు ఎంపీడీవో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

పెయ్యదూడలు లాభదాయకం

రాప్తాడు, న్యూస్‌టుడే: లింగనిర్ధారిత వీర్యంతో 90 శాతం కచ్చితత్వంతో పెయ్యదూడలు జన్మించడం రైతులకు లాభాదాయకం అని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం రాప్తాడు మండలం మరూరు గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. లింగనిర్ధారిత వీర్య ఎద సూదులను 2022 నంవబంర్‌లో గ్రామస్థాయి వరకు సరఫరా చేయడం జరిగింది.

విజయదశమికి పీఆర్సీ ప్రకటించాలి

అనంతపురం విద్య: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు విజయదశమికి 12వ పీఆర్సీ ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ విజ్ఞప్తి చేశారు. ఏపీటీఎఫ్ జోనల్‌శాఖ సమావేశం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. 12వ పీఆర్సీ 2023 జులై నుంచి అమలు కావాల్సి ఉండగా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు.

యూటీఎఫ్ నాయకుల నివాళి

జేఎన్టీయూ: యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నాగాటి నారాయణ ఆశయాలు కొనసాగిస్తామని యూటీఎఫ్ జిల్లా నాయకులు పేర్కొన్నారు. నాగాటి నారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు.

ఎస్బీఐ వితరణ

అరవిందనగర్: ఎస్‌బీఐ సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తోందని అనంతపురం రీజియన్ మేనేజర్ రమేశ్ బాబు తెలిపారు. నగరంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణించేందుకు బస్టాండుకు వచ్చే దివ్యాంగుల సౌకర్యం కోసం రెండు చక్రాల కుర్చీలను ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం అధికారులు ఆర్టీసీ అధికారులకు అందజేశారు.



చెత్త తరలించండి

రైల్వేస్టేషన్ సమీపాన రామచంద్రనగర్‌లో పవిత్ర హైపర్ మార్ట్ వద్ద చెత్త కుండీ వద్ద అధ్వానంగా ఉంది. కుండీ నుంచి చెత్త మొత్తం రోడ్డుపై పడుతోంది. రెండు రోజులుగా చెత్త తరలించక సమస్య ఉందని స్థానికులు చెబుతున్నారు. - **న్యూస్‌టుడే, కమలానగర్**

ఆన్‌లైన్ చెల్లింపుతో తంటా.. మహిళకు వేధింపులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ మహిళ తను చేసిన ఫోన్ పే వల్ల చిక్కుల్లో పడింది. నగదు కోసం అపరిచిత వ్యక్తికి చేసిన ఫోన్ పే సంసారంలో చిచ్చురేపింది. సదరు వ్యక్తి వేధింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించింది.. నగరానికి చెందిన ఓ మహిళ నగరంలోని లక్ష్మీనగర్‌లో చీరలు కొనడానికి ఓ వ్యాపారి వద్దకు వెళ్లింది. చీరలు కొనుగోలు చేశాక చెల్లింపులు చేసే క్రమంలో నగదు తక్కువైంది. సదరు వ్యాపారి నగదు మాత్రమే కావాలనడంతో, అక్కడే ఉన్న గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన రమేశ్‌ను బాధితురాలు నగదు అడిగింది. అతడు నగదు ఉంది అనడంతో బాధితురాలు రమేశ్‌కు ఫోన్ పే చేసింది. దీంతో అతను తన వద్ద నగదును చీరల వ్యాపారికి ఇచ్చాడు. కొన్ని రోజుల తర్వాత ఫోన్ పేలో ఉన్న బాధితురాలి నంబరు తీసుకుని అప్పుడప్పుడు ఫోన్ చేసి మాట్లాడేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఆర్థిక లావాదేవీలు కొనసాగాయి. సదరు వ్యక్తి ప్రవర్తన సరిగా లేకపోవడంతో మహిళ అతనికి దూరంగా ఉంటోంది. అయినా అతడు వదిలి పెట్టకుండా ఆమెను ఫోన్‌లో వేధింపులకు గురిచేస్తూనే ఉన్నాడు. వారి మధ్య ఉన్న సంబంధాన్ని బాధితురాలి భర్త, బంధువులకు చెడుగా చెప్పాడు. జరిగిన విషయం బాధితురాలు వివరించడంతో మిన్నకుండిపోయారు. వేధింపులు ఆపకుండా ఆమె కూలి పనిచేసే చోటుకు వెళ్లి అసభ్యంగా మాట్లాడి గొడవపడేవాడు. గత కొన్ని రోజులుగా అతని చేష్టలు మితిమీరిపోయాయి. భయపడిన మహిళ కుటుంబ సభ్యులకు తెలిపింది. వారితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మేడ పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

అనంత నేరవార్తలు: పక్కింటి మేడ పైన ఆరేసిన బెడ్‌షీట్లను తీసుకోవడానికి వెళ్లిన ఓ వ్యక్తి కాలు జారి కిందకు పడి మృతి చెందిన ఘటన గురువారం నగరంలో చోటు చేసుకుంది. మూడో పట్టణ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని శ్రీశ్రీనగర్‌కు చెందిన పవన్‌కుమార్ (35), సుభాషిణిలు భార్యాభర్తలు. దసరా పండగ సందర్భంగా భార్య ఇంట్లోని బెడ్‌షీట్లను ఉతికి.. పక్కింటి మేడపై ఆరేసింది. మధ్యాహ్నం ఉన్నఫళంగా వర్షం కురిసింది. ఆరేసిన బెడ్‌షీట్లను తీసుకురావడానికి పవన్ మేడపైకి వెళ్లాడు. వాటిని తీసే క్రమంలో ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి కాలు జారి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యార్థిని అదృశ్యం

అనంత నేరవార్తలు: నగరంలోని మూడో పట్టణ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. కూడేరు మండలానికి చెందిన విద్యార్థిని అనంతపురంలో ఉంటూ చదువుకుంటోంది. ఐదు రోజుల క్రితం ఆమె ఉంటున్న ప్రైవేటు వసతిగృహం నుంచి కళాశాలకు వెళ్లింది. తిరిగి వెళ్లలేదు. విషయం విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పలుచోట్ల గాలించారు. గురువారం మూడో పట్టణ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు.

హడావుడి పనులు.. అస్తవ్యస్తంగా దారులు!

సాయినగర్, న్యూస్‌టుడే: నగరంలోని సాయినగర్ అత్యంత రద్దీ ప్రదేశం. నగరపాలక ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి అంబేడ్కర్ భవన్ మీదుగా కలెక్టరేట్ వరకు వెళ్లే వరకు రద్దీగా ఉంటుంది. జీరో క్రాస్‌తో ప్రారంభం అయితే సాయినగర్‌లోనే ఏడు క్రాస్‌లు ఉన్నాయి. రద్దీ ప్రదేశం కావడంతో దుమ్ము, ధూళి, కాలుష్యం, ఎక్కువే.. జాతీయ స్వచ్ఛత గాలి (ఎన్ క్యాప్) నిధులతో రోడ్డు వేయని ప్రాంతంలో ఫేవర్ బ్లాక్స్ (టైల్స్) వేస్తే కొంత వరకు దుమ్ము ఉండదన్నది ఆలోచన. ప్రస్తుతం ఎడాపెడా జరుగుతున్న పనులు ఆ దిశగా సాగుతున్నట్లు లేదు.

● సాయినగర్‌లోని ఓ ప్రధాన ఆసుపత్రి ఉన్న ఆరో క్రాస్, ఎస్‌బీఐ బ్యాంకు ఉన్న రెండో క్రాస్‌లో రోడ్డుకు చివరలో ఎన్‌క్యాప్ ద్వారా ఫేవర్ బ్లాక్స్ వేసే ప్రక్రియ ప్రారంభం అయింది. రూ.28 లక్షలతో ఏర్పాటు చేస్తున్నారు. ఆరో క్రాస్‌లో ఇప్పటికే పనులు పూర్తి అయ్యాయి. ఆసుపత్రి ప్రహరీ, కొన్ని మొక్కలు ఉండే ప్రాంతంలో అంతరం ఉంది. మట్టి అంతా అందులో పడే అవకాశం ఉంది. ఎస్‌బీఐ బ్యాంకు ఉన్న ప్రాంతంలో హడావిడిగా పనులు చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా రాళ్లు పడేయడంతో రాకపోకలు ఇబ్బందిగా ఉంది.



రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్లు



వైద్య విద్య కళాశాల వద్ద దుమ్ముతో నిండి కన్పించని టైల్స్

దుమ్ముతో నిండినా శుభ్రం చేయరేం!

తెలుగు తల్లి విగ్రహం నుంచి వైద్య కళాశాల మీదుగా సాయినగర్ లోకి వెళ్లే మార్గం మొత్తం దుమ్ము పట్టి పోయింది. సంవత్సరం క్రితం వైకాపా హయాంలో ఈ మార్గంలో ఫేవర్ బ్లాక్స్ రోడ్డుకు రెండు వైపులా వేశారు. ఎన్‌క్యాప్, నగరపాలక సాధారణ నిధుల నుంచి రూ.17 లక్షలు వెచ్చించారు. ఫేవర్ బ్లాక్స్ కన్పించకుండా అడుగు మేర దుమ్ము పట్టాయి. వాహనాలు వెళ్లిన సమయంలో దుమ్ము రేగుతోంది.